

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



థీమ్ పార్కులకు మేం రెడీ: మంత్రిని కలిసిన ఇన్వెస్టర్లు

7

## నేతన్న లోగిట్లో 'చంద్ర'కాంతులు!

- ఎన్నికల హామీ నెరవేర్చిన చంద్రబాబు
- నేడు కొత్త పథకాలకు శ్రీకారం
- రూ.189.62 కోట్లతో ఉచిత విద్యుత్ అమలు
- రూ.5 కోట్ల త్రిఫ్ట్ పథకానికి నిధులు
- 5 శాతం జీఎస్టీ మినహాయింపు
- 365 రోజులూ ఉపాధి...
- నేతన్నల ఆర్థిక వృద్ధికి ప్రణాళికలు
- క్లస్టర్లు, టెక్స్‌టైల్స్ పార్క్‌ల ఏర్పాటు
- మంత్రి లోకేశ్ స్ఫూర్తితో రాష్ట్రంలో వీవర్‌శాలలకు ప్రణాళిక
- విశాఖలో రూ.172 కోట్లతో యూనిట్ మాల్ నిర్మాణం

- వివరాలు 3 లో..



### వీవర్స్‌శాలలకు సీఎం

*జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేడు మంగళగిరిలో పర్యటన*

5

# సింగపూర్ మంత్రులనే బెదిరించారు!

- సింగపూర్‌తో వైసీపీ వైఖరిపై చంద్రబాబు
- అక్కడి పరిస్థితిని మంత్రులకు వివరించిన వైనం
- కేబినెట్ భేటీ అనంతరం చర్చలో ప్రస్తావన
- విశాఖ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు వస్తున్నట్టు వెల్లడి
- 'స్త్రీశక్తి' ప్రారంభంలో తప్పక ఉండాలని ఆదేశం
- పాలనలో మరింత వేగం పెరగాలి
- మంత్రులు దూకుడు పెంచాలని సీఎం సూచన



*జగన్ ప్రభుత్వ అరాచక పాలనలో సింగపూర్ ప్రభుత్వం ఎంత భయపడిందో ముఖ్యమంత్రి చంద్రబాబు మాటల్లో మరోసారి ద్యోతకమైంది. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సింగపూర్ పర్యటనా విశేషాలను చర్చించిన చంద్రబాబు.. జగన్ ప్రభుత్వ నిర్వాకం కారణంగా సింగపూర్‌లో ఎదురైన పరిణామాలను ప్రస్తావించారు. ఏపీపై సింగపూర్‌కు సడలిన నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చిందని మంత్రులకు స్పష్టం చేశారు. మంత్రివర్గ సమావేశం అనంతరం రాజకీయాంశాలను చర్చిస్తూ.. విశాఖ పెట్టుబడుల సదస్సుకు వచ్చేందుకు సింగపూర్ ప్రభుత్వం అంత తేలికగా అంగీకరించలేదన్నారు. వైకాపా హయాంలో సింగపూర్ వెళ్లి మరీ అక్కడి మంత్రులను బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా వ్యవహారంతో ఏపీపట్ల సింగపూర్ విశ్వసనీయతను కోల్పోయిందని, మాజీ సీఎం వైఎస్ జగన్ దెబ్బకు సింగపూర్ వాళ్లు ఎట్టి పరిస్థితుల్లో ఏపీకి వచ్చేదిలేదన్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో.. ఆ దేశానికి వెళ్లి మరీ సింగపూర్ మంత్రులను బెదిరించిన ఘట్టం తన దృష్టికి వచ్చిందని చంద్రబాబు మంత్రులతో చర్చలో ప్రస్తావించారు. అయితే, స్నేహ సంబంధాల పునరుద్ధరణకు చేసిన సూచనకు ఒప్పుకున్నారన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా మొత్తం 41 సమావేశాల్లో పాల్గొన్నట్టు సీఎం చంద్రబాబు మంత్రులకు వివరించారు.*

- వివరాలు 2 లో..

6



## స్త్రీశక్తికి కేబినెట్ ఓకే

నూతన బార్ పాలసీకీ మంత్రిమండలి ఆమోదం

చేనేతలకు కూటమి ప్రభుత్వం వరాలు..

సీఆర్‌డీఏ ప్రతిపాదనలకు లభించిన ఆమోదం

పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా భూకేటాయింపులు

శ్రీకాకుళం, కుప్పం రక్షిత మంచినీటికి నిధులు

17 అంశాలను చర్చించి ఆమోదించిన కేబినెట్

సీఎం చంద్రబాబు అధ్యక్షతన 27వ ఈ-కేబినెట్ భేటీ

వివరాలు వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారథి



8

## జాతీయ ప్రాజెక్టులు పరుగులు పెట్టాలి

*ఎన్‌హెచ్, రైల్వే ప్రాజెక్టులపై టాస్క్ ఫోర్స్ భేటీలో జనార్ధన్ రెడ్డి*



9

## తప్పులొప్పుకో.. లెంపలేసుకో..!

*జగన్‌కు ఏపీఎస్‌ఎఫ్‌డీసీ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి హితవు*



## పదునుదేరితేనే ఎదుగుదల!

- నైపుణ్యం మెరుగుతోనే భవిష్యత్ అవకాశాలు
- 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నాం
- గ్రీన్ ఎనర్జీ సెక్టార్‌లో యువత, మహిళలకు అవకాశాలు
- సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తాం
- గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్‌లో మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటన

- వివరాలు 4 లో..

## 'ఆంధ్రా ఈజ్ బ్యాక్'!

సీఐఐ భాగస్వామ్య సదస్సు లక్ష్యమిదేనన్న మంత్రి లోకేష్

5 సదస్సు నిర్వహణపై కేబినెట్ సబ్‌కమిటీ తొలి సమీక్ష

విశాఖ ఏయూ గ్రౌండ్స్‌ను ఖరారు చేసిన ఉపసంఘం

## ఆ నోట్ల కట్టలు నోళ్లు తెరుస్తాయి!

- *జగన్ ముఠా నేర రాజకీయం ముగుస్తుంది*
- *ప్రజాగ్రహం డైవర్షన్‌కే కేసిరెడ్డి పిటిషన్ డ్రామా*
- *లాజిక్కులు.. మ్యాజిక్కులతో నిజాన్ని కప్పిపెట్టలేరు..*
- *విజయేందర్‌రెడ్డి చంద్రబాబు మనిషైతే.. ఆయన 2020లో స్థాపించిన యువి డిస్టిలరీకి రూ.224 కోట్ల ఆర్డర్లు ఎందుకిచ్చారు?*
- *ఒంగోలు పార్లమెంటుకు చెవిరెడ్డికి డమ్మీగా వెంకటేష్‌నాయుడు చేత ఎందుకు నామినేషన్ వేయించారు?*
- *అవినీతి విష పత్రిక సాక్షి ఉద్యోగి వర్ధెల్లి మురళి కుతంత్రం-27*

- వివరాలు 5 లో..


చైతన్యరథం



# ఆ దేశానికి వెళ్లి మరీ బెదిరించారు!

అమరావతి (చైతన్య రథం): జగన్ ప్రభుత్వ అరాచక పాలనలో సింగపూర్ ప్రభుత్వం ఎంత భయపడిందో ముఖ్యమంత్రి చంద్రబాబు మాటల్లో మరోసారి ద్యోతకమైంది. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సింగపూర్ పర్యటనా విశేషాలను చర్చించిన చంద్రబాబు.. జగన్ ప్రభుత్వ నిర్వాకం కారణంగా సింగపూర్‌లో ఎదురైన పరిణామాలను ప్రస్తావించారు. ఏపీపై సింగపూర్‌కు సడలిన నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు స్పష్టం చేశారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం రాజకీయాంశాలు సహా పలు కీలక అంశాలను ప్రస్తావించడంతోపాటు.. తమ సింగపూర్ పర్యటనకు సంబంధించిన అంశాలను మంత్రులతో సీఎం చంద్రబాబు పంచుకున్నారు. చర్చలో భాగంగా.. పెట్టుబడుల సదస్సుకు వచ్చేందుకు సింగపూర్ ప్రభుత్వం అంత తేలికగా అంగీకరించలేదన్న విషయాన్ని స్పష్టం చేశారు. వైకాపా హయాంలో సింగపూర్ వెళ్లి మరీ అక్కడి మంత్రులను బెదిరించారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా వ్యవహారంతో ఏపీపట్ల సింగపూర్ విశ్వసనీయతను కోల్పోయిందని అన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ దెబ్బకు సింగపూర్ వాళ్లు ఎట్టి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రానని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వారు.. అక్కడికి వెళ్లి మరీ సింగపూర్ మంత్రులను బెదిరించారని వాళ్లే చెబుతున్నారు. కేసులు పెడతామని బెదిరించి వాళ్లను భయపెట్టే పరిస్థితి తలెత్తిందని చంద్రబాబు మంత్రులకు వివరించారు. సీడ్ క్యాపిటల్‌లో తాము భాగస్వామ్యం కాబోమని సింగపూర్ స్పష్టం చేసిందన్నారు. పార్టనర్ షిప్ సమ్మిట్‌కు వాళ్లని రమ్మని ఆహ్వానించామని తెలిపారు. స్నేహ సంబంధాలు కొనసాగించాలని వారిని సూచించినట్టు పేర్కొన్నారు. అందుకు వాళ్లు సైతం ఒప్పుకున్నారని చెప్పారు. సింగపూర్ పర్యటనలో భాగంగా మొత్తం 41 సమావేశాల్లో పాల్గొన్నట్టు సీఎం వివరించారు.

స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నామని.. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కేబినెట్ మంత్రులను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అయితే ఆగస్ట్ 15 స్వాతంత్ర దినోత్సవమని.. ఆ రోజు చాలా కార్యక్రమాలు ఉంటా యని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు మంత్రులు విన్నవించారు. కానీ టైమ్ అడ్జెట్ చేసుకుని కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని సీఎం సూచించారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించక ముందే ఆటో డ్రైవర్లతో మాట్లాడాలని సీఎంకు మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. మంచి సూచన చేశారంటూ నాదెండ్లకు చంద్రబాబు కితాబిచ్చారు. ఆటోడ్రైవర్లతో మాట్లాడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతన బార్ పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో కల్లు గీత కార్మికులకు కేటాయించిన దుకాణాల్లో బినామీలు వస్తే సహించబోనని సీఎం హెచ్చరించారు.



- సింగపూర్‌తో వైసీపీ వైఖరిపై చంద్రబాబు
- అక్కడి పరిస్థితిని మంత్రులకు వివరించిన వైనం
- కేబినెట్ భేటీ అనంతరం చర్చలో ప్రస్తావన
- విశాఖ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు వస్తున్నట్టు వెల్లడి
- 'స్త్రీశక్తి' ప్రారంభంలో తప్పక ఉండాలని ఆదేశం
- పాలనలో మరింత వేగం పెరగాలి
- మంత్రులు దూకుడు పెంచాలని సీఎం సూచన

## మంత్రులు దూకుడు పెంచాలి

"మంత్రులు ఏడాదిగా సబ్జెక్టు నేర్చుకుంటూ మెరుగ్గా పనిచేశారు. ఇక హనీమూన్ కాలం వదిలి పాలనలో దూకుడు పెంచాలి. తప్పుడు వార్తల ప్రచారం, వైకాపా కుట్రలు, అతి తెలివైన నేరగాళ్లపట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలి. మహిళలపై అసభ్య వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టాలి. అంతర్జాతీయ సంబంధాలకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తాం. సింగపూర్ విధానాల స్టడీకి మంత్రులు దశలవారీగా అక్కడికి వెళ్లాలి. ప్రభుత్వం పట్ల ప్రజల్లో పూర్తి సానుకూలత ఉంది. మంత్రుల పనితీరుతో అది మరింత పెరగాలి. ఎమ్మెల్యేలతో మాట్లాడా.. పొరపాట్లు సరిదిద్దుకుంటామని చెప్పారు. జనసేన, భాజపా నేతలు కూడా లోపాలను సరిదిద్దుకోవాలి. మంత్రులు తమ శాఖలపై ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేసుకోవాలి. వచ్చే క్యాబినెట్ భేటీలో ప్రతి మంత్రితో వారి శాఖపై మాట్లాడిస్తా" అని చంద్రబాబు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు టికెట్ నమూనాను ఈ సందర్భంగా మంత్రులకు సీఎం చంద్రబాబు చూపించారు.

తొలుత –ఈ కేబినెట్ సమావేశంలో కొత్త బార్ పాలసీని కేబినెట్ ఆమోదించింది. అయితే కల్లు గీత కార్మికుల కోసం కేటాయించిన షాపుల్లో బినామీలు వస్తే సహించేదిలేదని హెచ్చరించింది. ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలకు ఉచిత ప్రయాణం ప్రారంభానికి ముందే.. ఆటో డ్రైవర్లను పిలిపించి వారితో మాట్లాడాలని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశంలో సూచించారు. ఈ సూచనపై సీఎం చంద్రబాబు సాను కూలంగా స్పందించారు. ఆటో డ్రైవర్లను వెంటనే పిలిపించి వారితో సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వారితో మాట్లాడి తగిన సహాయం చేయాలని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా సూచించారు. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ప్రమోషన్‌లో భాగంగా ఏపీకి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు జులై 26నుంచి 31వ వరకు సింగపూర్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులు, కంపెనీ సీఈఓలు, పారిశ్రామికవేత్తలతో ఆయన వరుసగా భేటీలు నిర్వహించారు. ఆ క్రమంలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, వనరులు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, పారిశ్రామిక పాలసీ, భూమి లభ్యత తదితర అంశాలను వారికి సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు.

ఇక ఈ ఏడాది నవంబర్‌లో విశాఖపట్నం వేదికగా పెట్టుబడుల సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సింగపూర్‌లోని పారిశ్రామికవేత్తలను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. అలాగే ఈ పర్యటనలో భాగంగా రౌండ్ టేబుల్ సమావేశాలు సైతం నిర్వహించారు. అదేవిధంగా ఆ దేశంలోని వివిధ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ సంస్థలను సీఎం చంద్రబాబు సందర్శించిన విషయం విదితమే. ఈ సింగపూర్ పర్యటనలో సీఎం చంద్రబాబు వెంట.. మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి నారాయణతోపాటు పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ పర్యటనను ముగించుకుని జులై 30న చంద్రబాబు, మంత్రులు లోకేష్, టీజీ భరత్‌లు అమరావతికి తిరిగి వచ్చిన విషయం తెలిసిందే.

# యూత్ సమ్మిట్‌లే సరైన వేదికలు

- యుతవ తమ నైపుణ్యాలు ప్రదర్శించే తరుణమిది
- కోనసీమ యూత్ సమ్మిట్ పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి లోకేష్




ఉండవల్లి (చైతన్య రథం): అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆగస్టు 12న రాష్టకార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో రామచంద్రాపురంలో నిర్వహించనున్న కోనసీమ యూత్ సమ్మిట్ పోస్టర్‌ను బుధవారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఐటీ, విద్యా మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువతలో దాగివున్న ప్రజ్ఞ, నైపుణ్యాన్ని రాష్ట్ర భవిష్యత్ అవసరాలకు వినియోగించుకునేందుకు కోనసీమ యూత్ సమ్మిట్‌వంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. యువత తమ ఆలోచనలు వ్యక్తపరచడానికి యూత్ సమ్మిట్ సరైన వేదికని మంత్రి లోకేష్ అభిప్రాయపడ్డారు.అభివృద్ధి అజండాగా భవిష్యత్ ప్రణాళికలు చర్చించడంతోపాటు,యువతలోని నాయకత్వ లక్షణాలు,పరిస్థితులకు తగినట్టు వేగంగానిర్ణయాలు తీసుకునే ఆలోచన విధానాలను యూత్ సమ్మిట్ వంటి కార్యక్రమాలద్వారా యువత అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. యువతకు ఎంతో ఉపయోగ పడే ఇటువంటి కార్యక్రమనిర్వహణకు నడుబిగించిన మంత్రి సుభాష్‌ను మంత్రి లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు.కేబినెట్ సమావేశానికి ముందు జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం రాంనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి, సవిత, గుమ్మడి సంధ్యారాణి, అనగాని సత్యప్రసాద్, రాంప్రసాద్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

చైతన్యరథం

# నేతన్న లోగిట్లో 'చంద్ర'కాంతులు!

- చేనేతలకిచ్చిన ఎన్నికల హామీ నెరవేర్చిన చంద్రబాబు
- నేడు 3 కొత్త పథకాలకు శ్రీకారం
- రూ.189.62 కోట్లతో ఉచిత విద్యుత్ పథకం అమలు
- రూ.5 కోట్ల త్రిఫ్ట్ పథకానికి నిధులు మంజూరు
- చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ మినహాయింపు
- 365 రోజులూ ఉపాధి... నేతన్నల ఆర్థిక వృద్ధికి పథకాల రూపకల్పన
- క్లస్టర్లు, టెక్స్‌టైల్స్ పార్కుల ఏర్పాటు
- మంత్రి లోకేశ్ స్ఫూర్తితో రాష్ట్రంలో వీవర్‌శాలలకు ప్రణాళిక
- విశాఖలో రూ.172 కోట్లతో యూనిట్ మాల్ నిర్మాణం

అమరావతి (చైతన్య రథం): సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో చేనేతల బతుకుల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఏడాది కాలంనుంచి నేతన్నలు తమ కాళ్ల మీద తామే నిలబడి, గౌరవప్రదమైన జీవనం సాగించేలా బృహత్తర కార్యక్రమాలకు నాంది పలికింది. ఒకవైపు నేతన్నలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి వారి ఆర్థిక ఉన్నతికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. రాష్ట్రంలో వ్యవసాయం తరవాత అత్యధికులు చేనేత రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. 2.5 లక్షలమంది చేనేత వస్త్రాల తయారీనే జీవనాధారంగా చేసుకున్నారు. ఏపీలో 986 చేనేత సహకార సంఘాలు నేతన్నలకు ఉపాధి కల్పిస్తున్నాయి. రాష్ట్రంలో చేనేత రంగం రూ.1,374 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది.గత ప్రభుత్వ హయాంలో చేనేతలకు ప్రోత్సాహం కరవ్వడంతోపాటు ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కూడా లభించ లేదు. దీంతో 2019-24 కాలంలో రాష్ట్ర చేనేత రంగంలో చీకటి కాలంగా మిగిలిపోయింది. సీఎం చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్ర ద్వారా మంత్రి నారా లోకేశ్ చేనేతల కష్టాలనుచూసి చలించి పోయారు. అధికారంలోకిరాగానే నేతన్నలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఇచ్చిన హామీలను నిల బెట్టుకుంటూ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే చేనేతలకు మేలు కలిగేలా నిర్ణయాలు తీసు కుంటున్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో నేతన్నలకు ప్రత్యేక యూనిట్లు కేటాయిస్తున్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి రూ.10 వేల కోట్ల పెట్టుబడితో నూతన టెక్స్‌టైల్స్ పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీ ద్వారా 1.51 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం, చేనేత వస్త్రాలపై ఐదు శాతంమేర జీఎస్టీ మినహాయింపు, త్రిఫ్ట్ నిధులు మంజూరు పథకాలకు సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుడుతున్నారు. ప్రతి ఇంటినుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలన్న లక్ష్యంలో భాగంగా నేతన్నలను వ్యాపారులుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు.

## నేతన్నకు 50 ఏళ్లకే రూ.4 వేల పింఛను

2024లో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం కూడా చేనేతలకు మరోసారి అండగా నిలిచింది. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేస్తున్నారు. 92,724 మంది నేతన్నలకు రూ.3 వేలనుంచి రూ.4 వేలకు పెన్షన్ మొత్తం పెంచారు. ఈ ఏడాది జూన్ వరకూ రూ.545.50 కోట్లు నేతన్నల పెన్షన్ల కోసం చంద్రబాబు ప్రభుత్వం వెచ్చించింది.

## ముద్ర రుణాలు, నూలు సబ్సిడీ అందజేత

క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాల బలోపేతానికి బ్యాంకు రుణాలు అందజేస్తోంది. గతేడాది 116 చేనేత సహకార సంఘాలకు రూ.40.87 కోట్లను జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా అందజేసింది. ఈ ఏడాది 110 సంఘాలకు రూ.37.75 కోట్లు రుణమివ్వడానికి నిర్ణయించింది. ప్రధాన మంత్రి చేనేత ముద్ర యోజన పథకం (ముద్ర) కింద నేతన్నలకు గతేడాది వర్కింగ్ కాపిటల్ నిమిత్తం రూ.33.25 కోట్లు అందించింది. 3,367 నేతన్నలకు రూ.50 వేలనుంచి రూ.2 లక్షల రుణ సదుపాయం కల్పించింది. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో జూన్‌వరకు 294 మందికి రూ.2.57 కోట్లు మంజూరు చేసింది. ముడి పదార్థాల సరఫరా పథకం నూలు కొనుగోలుపై కూటమి ప్రభుత్వం 15 శాతం సబ్సిడీ అందజేస్తోంది. సహకార సంఘాలకు, వ్యక్తిగతంగా పలువురు నేతన్నలకు రూ.164.24 కోట్ల విలువైన నూలును 15 శాతం సబ్సిడీపై ఇవ్వగా, దీనివల్ల లబ్ధిదారులకు రూ.24.63 కోట్లమేర లబ్ధి కలిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 135మంది స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ.13.50 లక్షల విలువైన నూలును ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున కూటమి ప్రభుత్వం అందజేసింది.

## క్లస్టర్లు, టెక్స్‌టైల్స్ పార్కుల ఏర్పాటు...

కేంద్ర ప్రభుత్వ సహకారంతో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖపట్నంలో ఐదు ఎకరాల్లో రూ.172 కోట్లతో యూనిటీ మాల్ నిర్మిస్తోంది. రాష్ట్రంలో టెక్స్‌టైల్స్ పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఎమ్మిగనూరుతో పాటు రాయదుర్గం, మైలవరం, పామిడిలోనూ టెక్స్‌టైల్స్ పార్కులు నిర్మించనుంది. ఎమ్మిగనూరు టెక్స్‌టైల్స్ పార్కును 77 ఎకరాల్లో నిర్మాణానికి ప్రభుత్వం శంకుస్థాపన కూడా చేసింది. చీరాలలో హ్యాండ్లూమ్ పార్క్‌తోపాటు టెక్స్‌టైల్స్ పార్కు కూడా ఏర్పాటు చేయనుంది. మంగళగిరి మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2014-19లో రూ.50.15 కోట్లతో 54 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. జాతీయ హ్యాండ్‌లూమ్ అభివృద్ధి ప్రోగ్రామ్ కింద 2024-25లో రూ.10.44 కోట్లతో 10 క్లస్టర్లు ఏర్పాటు చేస్తోంది. ఈ క్లస్టర్లతో 2,020 మంది లబ్ధిపొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో రూ.38.21 కోట్లతో భారీ చేనేత క్లస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. ఈ క్లస్టర్‌వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేలమందికి లబ్ధి చేకూరనుంది. మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన వీవర్‌శాల మాదిరిగా రాష్ట్రవ్యాప్తంగా వీవర్ శాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది

## రూ.80 కోట్లమేర ఆప్కో అమ్మకాలు

కాలనుగుణంగా నూతన వస్త్రాల తయారీలో ఐదు జిల్లాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. చేనేత వస్త్రాల విక్రయాలకు రాష్ట్రంతోపాటు దేశంలోని ఏడు నగరాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసింది. ఆప్కో నేతృత్వంలో ఈ-కామర్స్ ద్వారా నేరుగా వినియోగదారుల ఇళ్ల వద్దకే చేనేత వస్త్రాలను డెలివరీ చేస్తోంది. ఏడాది కూటమి పాలనలో ఆప్కో షోరూమ్‌ల ద్వారా రూ.80 కోట్లమేర అమ్మకాలు జరిగాయి. ఈ-కామర్స్ ద్వారా రూ.40 లక్షలమేర అమ్మకాలు జరపడం విశేషం. నేటితరం అభిరుచులకు అనుగుణంగా చేనేత రెడీమేడ్ వస్త్రాల ను రూపొందించి ఆప్కోషోరూమ్‌ల ద్వారా అమ్మకాలు చేపట్టింది. ఏడాదిలో రాష్ట్రంలో ఐదు ఆప్కో షోరూమ్ లను ప్రభుత్వం ప్రారంభించింది. నేతన్నలకు 365 రోజులపాటు పనిదినాలు కల్పించడంతో పాటు చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికి టాటా తనేరియా, ఆద్యం బిర్లా గ్రూప్, తమిళనాడుకు చెందిన కో-ఆప్టెక్స్‌తోనూ ఒప్పందం చేసుకుంది.

## ఓడీఓపీ అవార్డుల వెల్లువ

రాష్ట్రంలో చేనేతరంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తు న్నాయి. ఇందుకు నిదర్శనమే వన్ డిస్ట్రిక్- వన్ ప్రొడెక్ట్ (ఓడీఓపీ) అవార్డులు. కేంద్ర ప్రభుత్వం 29 ఓడీఓపీ అవార్డులు ప్రకటిస్తే, అందులో 9 అవార్డులు ఏపీకే సొంతమయ్యాయి. వాటిలో 4అవార్డులు చేనేత ఉత్పత్తులకు దక్కాయి. ఓడీఓపీ రాష్ట్రస్థాయి అవార్డుల్లో ఏపీ బంగారు పతకం సాధించింది. భవిష్యత్తులో మరిన్ని ఓడీఓపీ అవార్డుల సాధనే ధ్యేయంగా చేనేత కార్మికులకు నైపుణ్యం పెంపుదలకు శిక్షణ కార్యక్ర మాలు, తయారైన ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ గుర్తింపు నకు పెద్దపీట వేస్తోంది. 20చేనేత ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ కోసం రూ.24 లక్షలు వెచ్చిస్తోంది.

## నూతన డిజైన్లకు ప్రోత్సాహం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో చేనేత వస్త్రాల వినియోగం పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.దీనిలో భాగంగా నేతన్నలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.ఏపీ స్కిల్ డవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా అయిదు జిల్లాల్లో నైపుణ్య శిక్షణలు నిర్వహించగా 180 మంది లబ్ధి పొందారు. చేనేత కార్మికుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసే ఉద్దేశంతో, నూతన డిజైన్లపై దరఖాస్తులను కూటమి ప్రభుత్వం నేతన్నల నుంచి ఆహ్వానించింది. ఉత్తమ డిజైన్లకు రూ.5 లక్షల వరకూ బహుమతులు అందజేయనుంది.

## నేడు 3 పథకాలకు సీఎం చంద్రబాబు శ్రీకారం

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ, సీఎం చంద్రబాబు నాయుడు చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్‌నిచ్చే పథకానికి గురువారం శ్రీకారం చుడుతున్నారు. చేనేత దుస్తులపైనా 5శాతం జీఎస్టీ మినహాయింపు పథకాన్ని ప్రారంభిస్తున్నారు. చేనేతలకు రూ.5మేర త్రిఫ్ట్ నిధులు మంజూరు చేస్తున్నారు. ఉచిత విద్యుత్ కోసం ఏడాదికి రూ.190కోట్లను రాష్ట్రప్రభుత్వం వెచ్చిస్తోంది. జీఎస్టీ మినహాయింపునకు ఏడాదికి రూ.15 కోట్లను నేతన్నలకు చెల్లించాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ పథకంతో మగ్గాలపై నేసే నేతన్నలకు నెలకు 1,233ల చొప్పున్న ఏడాదికి రూ.14,956లు, మర మగ్గాలపై ఆధారపడిన వారికి నెలకు రూ.2,717ల చొప్పున ఏడాదికి 32,604ల మేర లబ్ధి కలగనుంది. చేనేత కుటుంబాలకు త్వరలో ఆరోగ్య బీమా పథకం వర్తింప జేయడానికి ప్రణాళికలు రూపొందించింది. త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టింది.





# పదునుదేరితేనే ఎదుగుదల!

- నైపుణ్యం మెరుగుతోనే భవిష్యత్ అవకాశాలు
- 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నాం
- గ్రీన్ ఎనర్జీ సెక్టార్‌లో యువత, మహిళలకు అవకాశాలు
- సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తాం
- గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్‌లో మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటన



విజయవాడ (చైతన్య రథం): కాలానుగుణంగా యువత నైపుణ్యాలకు పదునుపెట్టినపుడే అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుతాయని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. విజయవాడ నోవాటెల్‌లో "సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్" అంశంపై ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్తంగా నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్‌కు మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతూ.. ఈ కాన్ఫరెన్స్ కేవలం దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్‌ను శక్తివంతం చేయడం, సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్‌గా ఏపీని తీర్చిదిద్దడమే కాదు.. ప్రపంచ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్‌ను శక్తివంతంచేసే దిశగా నిర్వహించడం జరుగుతోందని, తద్వారా యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

### యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కష్టపడుతున్నాం

దేశంలో ఏ పార్టీ సాధించని విధంగా కూటమి ప్రభుత్వం 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో 164 సీట్లను కైవసం చేసుకుంది. కూటమి ప్రభుత్వంలో ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఇందుకోసం అందరం కష్టపడి పనిచేస్తున్నాం. ఒకే రాష్ట్రం- ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. క్లస్టర్ విధానంలో పెట్టుబడులను ఆకర్షిస్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తాం. అనంతలో ఆటోమొబైల్, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, కడప, చిత్తూరును ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా, నెల్లూరులో ఎయిర్ కండిషనర్స్‌వంటి స్పెషలైజ్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రకాశం జిల్లాను సీబీజీ హబ్‌గా, గుంటూరు, కృష్ణాను క్యాంటమ్ వ్యాలీ హబ్‌గా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను ఆక్వా హబ్‌గా, ఉత్తరాంధ్రను ఫార్మా, డేటా సెంటర్, ఐటీ హబ్‌గా, మెడికల్ డివైస్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తయారు చేస్తాం. ప్రతి వంద కి.మీలకు ఓ క్లస్టర్ ఏర్పాటుచేసి ఆయా రంగాల్లో టాప్ 20 కంపెనీలను తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నాం. దీంతోపాటు నైపుణ్యం పెంపు, నవీన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు మంత్రి లోకేష్ ప్రకటించారు.

### సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తాం

"రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ప్రైవేటు సెక్టార్‌తో నైపుణ్యంగల యువతను అనుసంధానించాల్సిన అవసరం ఉంది. సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తాం. ప్రపంచ అవసరాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరముంది. పునరుత్పాదక ఇంధనరంగంలో ప్రపంచవ్యాప్తంగా అనేక అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రం చొరవ తీసుకుని యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తాం. అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతను సిద్ధం చేయాల్సిన అవసరముంది. నా ఛాలెంజ్‌ను స్వీకరించి సుజ్లాన్ సంస్థ ఇప్పటికే 2 నైపుణ్య శిక్షణా కేంద్రాలను నిర్మించింది. అవి ఇప్పటికే పనిచేస్తున్నాయి" అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### గ్రీన్ ఎనర్జీ సెక్టార్ ద్వారా యువతకు విస్తృత అవకాశాలు

"గ్రీన్ ఎనర్జీ సెక్టార్ ద్వారా మహిళలకు వారి గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యువగళం పాదయాత్ర సమయంలో అనంత జిల్లాలోని కియా యాన్సిలరీ యూనిట్స్‌లో మహిళలు పనిచేయడం చూశాను. ఓ మహిళ నా వద్దకు వచ్చి నాతోపాటు నడిచారు. ఏం చేస్తున్నారని ప్రశ్నించినపుడు.. కియా యాన్సిలరీ యూనిట్స్ లో పనిచేస్తున్నానని, గతంలో సాధారణ గృహిణిగా ఉన్న తాను ఇప్పుడు నెలకు రూ.40వేలు సంపాదిస్తూ కుటుంబానికి అండగా నిలిచానని గర్వంగా చెప్పారు. ఇప్పుడు కుటుంబంలో తనకు ఎంతో గౌరవం దక్కుతోందని చెప్పారు. ఒక్క కియా పరిశ్రమవల్ల అనంత పురం జిల్లాలో వచ్చిన మార్పు ఇది. గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా విస్తృత అవకాశాలు ఉన్నాయి. అందుకే విండ్, సోలార్, రెన్యువబుల్, పంప్డ్ స్టోరేజీ, సీబీజీ ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టిసారించాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై సీఎం చంద్రబాబు చాలా పట్టుదలతో ఉన్నారు. దీనిని చాలా ప్రాముఖ్యతగా తీసుకున్నాం. ఇందుకోసం ప్రైవేటు సెక్టార్‌తో కలిసి పనిచేస్తాం. ఓంక్యాప్ ద్వారా యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని" లోకేష్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపిఎస్ఎస్‌డిసి ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, నెర్డ్‌కేప్ వైస్ ఛైర్మన్ కమలాకర్ బాబు, స్వనీతి ఇనీషియేటివ్ సీఈఓ రీత్వికా భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.





# యువగళం మరో హామీని నెరవేర్చిన మంత్రి లోకేష్

- కర్నూలులోని నిరుపేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలు
- 40 ఏళ్ల కల నెరవేర్చారంటూ లోకేష్‌కు కృతజ్ఞతలు


అమరావతి (చైతన్య రథం): విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మరో యువగళం హామీని నెరవేర్చారు. కర్నూలు పట్టణం అశోక్ నగర్‌లోని నగరపాలక సంస్థ పంప్‌హౌస్ ప్రాంతంలో నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలంలో నివాసముంటున్న 150మంది గూడెం కొట్టాలు వాసులకు శాశ్వత ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. నిరుపేదలైన వీరు గూడెం కొట్టాల ప్రాంతంలో పూరి గుడిసెలు వేసుకుని నాలుగు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారు. తమకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని ఏళ్లుగా ప్రజాప్రతినిధులను కోరుతున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. యువగళం పాదయాత్రలో భాగంగా కర్నూలు వచ్చిన నారా లోకేష్‌ను అప్పటి కర్నూలు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ టీజీ భరత్ నేతృత్వంలో గూడెం కొట్టాలు వాసులు కలిసి తమకు శాశ్వత పట్టాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన నారా లోకేష్... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాశ్వత పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.



ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వంలో 2025 జనవరిలో తీసుకువచ్చిన జీవో నెంబర్ 30 ద్వారా కోట్ల విలువ చేసే సుమారు ఎకరా స్థలాన్ని నిరుపేదలకు అప్పగించారు. మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా 150 మంది నిరుపేదలకు మంగళవారం నాడు శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. తమ 40 ఏళ్ల కల నెరవేర్చిన మంత్రి నారా లోకేష్ కు ఈ సందర్భంగా గుడెం కొట్టాల వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## మంగళగిరి వీవర్స్‌శాలకు నేడు సీఎం

### జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పర్యటన



అమరావతి (చైతన్య రథం): గుంటూరు జిల్లా మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం పర్యటించనున్నారు. అక్కడ జరిగే 11వ జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా మంగళగిరిలో మంత్రి లోకేష్ సహకారంతో గతంలో ఏర్పాటైన వీవర్స్‌శాలను సందర్శిస్తారు. అక్కడ మగ్గాలను, చేనేత వస్త్రాలను పరిశీలిస్తారు. హ్యాండ్లూమ్ ఉత్పత్తులకు మార్కెటింగ్ ఏవిధంగా ఉందనే అంశాలపై వీవర్స్ శాలలోని చేనేత కళాకారులతో సంభాషిస్తారు. అనంతరం చేనేత ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. చేనేత కుటుంబాలతో ముఖాముఖి మాట్లాడనున్నారు. అనంతరం నిర్వహించే ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తారు. కార్యక్రమంలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు.

## ఉత్తరకాశీ ఉత్పాతం దిగ్భ్రాంతికరం: చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): ఉత్తరకాశీలో సంభవించిన విపత్తు తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చాలామంది ప్రాణాలు కోల్పోయి, గల్లంతయ్యారని తెలిసి ఆవేదనకు గురైనట్టు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. తప్పిపోయినవారు సురక్షితంగా తిరిగి రావాలని ప్రార్థిస్తున్నట్టు 'ఎక్స్' వేదికగా చంద్రబాబు పోస్టు చేశారు. విరుచుకుపడిన ఆకస్మిక వరదలతో ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీ అల్లకల్లోలమైంది. గంగోత్రికి వెళ్లే మార్గంలోని ధరాలీ గ్రామం సగభాగం తుడిచిపెట్టుకుపోయింది. అక్కడి ఇళ్లు, కార్లు, చెట్లు వరదల్లో కొట్టుకుపోయాయి. 60నుంచి 70 మంది ఈవరదల్లో చిక్కుకుపోయారు.కనీసం నలుగురు మరణించారు. మరో 12మంది వరకూ శిథిలాలకింద ఉండిఉంటారని భావిస్తున్నారు.

# 'ఆంధ్రా ఈజ్ బ్యాక్'!



- సీఐఐ భాగస్వామ్య సదస్సు లక్ష్యమిదేనన్న మంత్రి లోకేష్
- పెట్టుబడుల ఆకర్షణకు దేశ విదేశాల్లో రోడ్ షోలు
- సదస్సు నిర్వహణపై కేబినెట్ సబ్‌కమిటీ తొలి సమీక్ష
- వేదికగా విశాఖ ఏయూ గ్రౌండ్స్‌ను ఖరారు చేసిన ఉపసంఘం

ఉండవల్లి (చైతన్య రథం): 'ఆంధ్రా ఈజ్ బ్యాక్' అనేలా నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే సీఐఐ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్) 30వ భాగస్వామ్య సదస్సు విజయవంతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు-2025ను సమన్వయం చేసేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యంలో ఉండవల్లి నివాసంలో తొలి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహణకు చేపట్టనున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఉప సంఘం ఛైర్మన్,మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ 'ఆంధ్రా ఈజ్ బ్యాక్' అనేవిధంగా సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించాలన్నారు. ప్రపంచ నలుమూలల నుంచీ పెట్టుబడులు ఆకర్షించేలా సదస్సును విజయవంతం చేయాలని సూచించారు. తద్వారా ఏపీలో ఉపాధి,ఆర్థికరంగవృద్ధి జరుగుతుంది. ఒక్కో దేశానికి సంబంధించిన ఒక్కో థీమ్‌ను సిద్ధం చేయాలని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ఆకర్షణ కోసం దేశ విదేశాల్లో రోడ్ షోలు నిర్వహించి.. పారిశ్రామికవేత్తలకు ఏపీని కేంద్రంగా చేయాలని మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. సదస్సుకు విశాఖ ఏయూ గ్రౌండ్స్‌ను మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఖరారు చేశారు. 'టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్: నేవిగేటింగ్ ది న్యూ జియో- ఎకనమిక్ ఆర్డర్' థీమ్‌తో సదస్సును సీఐఐ భాగస్వామ్యంతో నిర్వహించనున్నారు. ప్రతి 15 రోజులకోసారి మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమీక్షలో మంత్రులు టీజీ భరత్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్,కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు సీఎస్ కె విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఆ నోట్ల కట్టలు నోళ్లు తెరుస్తాయి

- జగన్ ముఠా నేర రాజకీయం ముగుస్తుంది
- రూ.11 కోట్ల నోట్ల కట్టలపై పెల్లుబికిన ప్రజాగ్రహం డైవర్షన్‌కే కేసిరెడ్డి పిటిషన్ డ్రామా
- లాజిక్కులు.. మ్యాజిక్కులు.. కుతంత్రాలతో నిజాన్ని కప్పిపెట్టుకోవడం సాధ్యం కాదు
- విజయేందర్‌రెడ్డి చంద్రబాబు మనిషైతే..
  ఆయన 2020లో స్థాపించిన యువి డిస్టిలరీకి రూ.224 కోట్ల ఆర్డర్లు ఎందుకిచ్చారు?
- విజయేందర్ రెడ్డి ఎరేట్ హాస్పిటల్‌లో కేసిరెడ్డి భార్యను ఎందుకు డైరెక్టర్‌గా చేర్చారు?
- ఒంగోలు పార్లమెంటుకు చెవిరెడ్డికి డమ్మీగా వెంకటేష్‌నాయుడు చేత ఎందుకు నామినేషన్ వేయించారు?
- వెంకటేష్‌నాయుడు తన ఏజెంట్ కాకపోతే అతనికి చెవిరెడ్డి 307 ఫోన్‌కాల్స్ ఎందుకు చేశారు?
- నోట్ల కట్టలను లెక్కిస్తున్న వెంకటేష్ వీడియో 2021 నాటిది-నాడు రూ.2వేల నోట్లు రద్దుకాలేదు.
- రూ.11 కోట్లలో ఏదైనా చేసివుంటే సిట్ అన్ని వివరాలతో ఎందుకు వీడియోలు తీసి కోర్టుకు ఇస్తుంది?
- మద్యం కుంభకోణంపై డజన్లకొద్దీ ప్రాథమిక సాక్ష్యాధారాల్ని సిట్ సేకరించింది నిజం
- కమిషన్ల కోసమే విషపూరిత మద్యంపోసి వేలాదిమంది ప్రాణాలు పోగొట్టింది నిజం
- కమిషన్ల కోసమే 99శాతం పైగా నగదులో అమ్మకాలు జరిపింది నిజం
- కమిషన్ల కోసమే ఆర్డర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)ను కంప్యూటర్ విధానం నుండి మాన్యువల్ విధానానికి మార్చింది నిజం

### అవినీతి విష పుత్రిక సాక్షి ఉద్యోగి వర్ధెల్లి మురళి కుతంత్రం-27

03.08.2025 ఆదివారం అవినీతి విషపుత్రిక సాక్షిలో వర్ధెల్లి మురళి, మద్యం మాఫియా కేసిరెడ్డి కుతంత్రపు కోర్టు పిటిషన్‌ను సమర్థిస్తూ భారీ వ్యాసం రాశారు. విషపూరిత మద్యంవల్ల వేలాదిమంది పేద ప్రజల ప్రాణాలు పోగొట్టుకున్నారు. లక్షలాది ప్రజల ఆరోగ్యాలు నాశనమయ్యాయి. మద్యం మాఫియా ధన పిశాచానికి పేదల ఒళ్లు, ఇళ్లు గుల్ల అయిపోయాయి. ఇలాంటి అమానుషాన్ని ఒక జర్నలిస్టుగా మురళి సమర్థించడం అనైతికం కాదా? పైగా ఆ వ్యాసంలో ఏపీ వినాశనాన్ని కోరుకుంటున్న కేసీఆర్ ముఠా వాదనల్ని సమర్థించడం ఆంధ్ర రాష్ట్ర ద్రోహం కాదా?

కోర్టు అనుమతి లేకుండానే రూ.11 కోట్ల నగదును బ్యాంకులో డిపాజిట్ చేయడం ద్వారా సిట్ మోసపూరితంగా వ్యవహరించిందని మురళి వ్రాయడం నిజాన్ని తలక్రిందులు చేయడమే అవుతుంది.

కోర్టు ఆదేశాల మేరకే తు.చ. తప్పకుండా 01.08.2025న స్టేట్ బ్యాంక్ మాచవరం బ్రాంచ్‌లో నగదు జమచేసి, వీడియో కూడా తీశామని ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ 04.01.2025న కోర్టులో జడ్జికి విన్నవించడమైంది.

రూ.11 కోట్లలో ఏదైనా తారుమారు చేయదలచుకుంటే 30.06.2025న జప్తు సమయంలో సిట్ ఎందుకు వీడియోలు తీస్తుంది? 01.07.2025న కోర్టు ఆదేశానుసారం తు.ఛ. తప్పకుండా ఎందుకు వీడియోలు తీస్తుంది? నగదు బ్యాంక్ నోట్లలో కలిసిపోయినా వీడియోలలో నోట్ల కట్టల వివరాలు ఉంటాయి గనుక ఏ సమస్యా రాదు. లేని సమస్యను ఉన్నట్లుగా చిత్రీకరించి కేసిరెడ్డి మరియు జగన్ ముఠా రూ.11 కోట్ల నోట్ల జప్తుపై ప్రజాగ్రహాన్ని తగ్గించుకునేందుకు కుతంత్రపు వాదనలు చేస్తున్నది. మద్యం కుంభకోణంపై సిట్ డజన్ల కొలదీ ప్రాథమిక సాక్ష్యాధారాలు సేకరించి ఉన్నది. జగన్ ముఠా ఎన్ని కుతంత్రాలు చేసినా వీటినుండి తప్పించుకోవడం అసాధ్యం.

వివేకానందరెడ్డిని హత్య చేయించి గుండెపోటు అని సాక్షిలో ప్రసారాలు చేశారు. హత్య అని నిర్ధరణ కావడంతో వెంటనే ప్లేటు ఫిరాయించి నారాసుర రక్తచరిత్ర అంటూ సాక్షిలో అబద్ధపు రాతలు రాశారు. ఇది అబద్ధమని తేలిన తరువాత డా.సునీత తన తండ్రిని హత్య చేయించిందని దుర్మార్గంగా ప్రచారం చేశారు. హత్యలో పాల్గొన్నవారే మనసుమారి సాక్ష్యం చెబితే దానికి విలువ లేదన్నారు. ఇలా తమ నేరాల్ని ఎదుటివారిపైకి నెట్టడం, అబద్ధాలు ప్రచారం చేయడం తంతుగా జగన్ ముఠా పెట్టుకుంది. జగన్ ముఠాకే కాదు తెలివుండేది... ఐదు కోట్లమంది ప్రజలకు అంతకన్నా ఎక్కువే తెలివి వున్నది. అందుకే వివేకా హత్య, విషపూరిత మద్యం, ల్యాండ్, శాండ్, వైన్, మైన్, రేషన్ బియ్యం మాఫియాల బాధిత ఓటర్లు 2024 ఎన్నికల్లో 11 సీట్లకు వైకాపాను కుదించారు. అయినా జగన్ ముఠా దారి మార్చుకోకుండా పాత నేరపూరిత దారిలోనే పోతున్నది.

అందులో భాగంగానే చెవిరెడ్డి సహనేరస్తుడు వెంకటేష్‌నాయుడు నోట్ల కట్టలు, విలాసాలు, జల్సాలు వెల్లడి కాగానే అతన్ని టీడీపీ వాడిగా చిత్రీకరించే విన్యాసానికి సాక్షి దిగజారింది. వెంకటేష్ టీడీపీ మనిషి అయితే ఒంగోలు పార్లమెంట్‌కు చెవిరెడ్డికి డమ్మీ అభ్యర్థిగా చెవిరెడ్డే వెంకటేష్ చేత ఎందుకు నామినేషన్ వేయించారు? స్వయంగా చెవిరెడ్డే వెంకటేష్‌నాయుడుకి 307 ఫోన్ కాల్స్ ఎందుకు చేశారు? జగన్ పాలనలో ఎయిర్ పోర్ట్‌లోకి ప్రభుత్వ బుగ్గకారు వెంకటేష్ కోసం ఎలా వెళ్ళింది? సాక్షిలో వ్రాసినట్టు రూ.35 కోట్లు నోట్లకట్టలు వెంకటేష్ ఎలా చెలామణి చేశారు? ఈరకంగా చూచినప్పుడు జగన్ ముఠాది కుతంత్రం కాక నిజమెలా అవుతుంది?

2023 మేలో రూ.2 వేల నోట్లు రద్దు అయితే 2024లో ఎలా నోట్ల కట్టల్లో ఉంటాయనేది మరో కుతర్కపు వాదన. వెంకటేష్‌నాయుడు నోట్ల కట్టల మధ్య ఉన్న వీడియో 2021 నాటిదని స్పష్టం చేయబడింది. 2021లో రూ.2 వేల నోట్లు చలామణిలో ఉండేవి. రూ.2 వేల నోట్లు రద్దు అయ్యింది 2023 మేలో. అయినా.. మిగిలివున్న వాటిని బ్యాంకుల్లో మార్చుకునే హక్కు ఉంది. ఈ విషయాలు తెలిసి కూడా జగన్ ముఠా ప్రజా దృష్టి మళ్ళించడానికి కుతర్కాన్ని తెరపైకి తెచ్చింది.

కొందర్ని కొంతకాలం మోసం చేయవచ్చు.

కాని అందర్నీ పూర్తికాలం నమ్మించడం ఎవరి తరం కాదు.

ఇది చరిత్ర నిరూపించిన సత్యం.

జగన్ ముఠా పాపం పండింది. మితిమీరిన డబ్బు పిచ్చితో విషపూరిత మద్యం పోసి వేలాదిమంది పేదల ప్రాణాలు తీశారు. లక్షలాది మందిని అనారోగ్యం పాలు చేశారు. సిట్ పోలీసులు డజన్ల కొలదీ వస్తురూపేణా, సాంకేతికపరమైన, లిఖిత పూర్వకమైన ఆధారాలు సేకరించింది. అంతిమ లబ్దిదారునితో సహా పాత్రధారులందరూ శిక్షకు గురికాక తప్పదు. లాజిక్కులు, మ్యాజిక్కులు, బెదిరింపులకు ప్రజలు భయపడరు. పైగా తిరగబడి నేరస్తులకు తగు పాఠం చెబుతారు. వైకాపాకు భవిష్యత్తు శూన్యం. 2029 కాదు కదా.. 2034లోనూ అధికారానికి ప్రజలు వైకాపాను రానివ్వరు. జగన్ ముఠా రెచ్చగొట్టే మాటలు నమ్మి అరాచకంగా ప్రవర్తిస్తే, వారి భవిష్యత్తును వారే నాశనం చేసుకుంటారు.

- గురజాల మాల్యాద్రి,
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్



# స్త్రీశక్తికి కేబినెట్ ఓకే

- నూతన బార్ పాలసీకీ మంత్రిమండలి ఆమోదం
- చేనేతలకు కూటమి ప్రభుత్వం వరాలు..
- ఉచిత విద్యుత్, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, థ్రిఫ్ట్ ఫండ్
- సీఆర్‌డీఏ ప్రతిపాదనలకు లభించిన ఆమోదం
- పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా భూకేటాయింపులు
- శ్రీకాకుళం, కుప్పం రక్షిత మంచినీటికి నిధులు
- 17 అంశాలను చర్చించి ఆమోదించిన కేబినెట్
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 27వ ఈ-కేబినెట్ భేటీ
- వివరాలు వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారథి




అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో నూతన బార్ పాలసీ, స్త్రీ శక్తి అమలు సహా పలు కీలక నిర్ణయాలకు ఏపీ మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అలాగే, అమరావతి సీఆర్డీఏ నిర్ణయాలకు ఆమోదం, శ్రీకాకుళం, కుప్పానికి వయబులిటీ గ్యాప్ ఫండింగ్ నిధులు విడుదల, పలు సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది. ప్రధానంగా కూటమి ప్రభుత్వమిచ్చిన హామీలో మరో హామీ అయిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి కేబినెట్ ఆమోద ముద్ర వేయడం ప్రభుత్వం విశ్వసనీయతను చాటుకోవడమేనని సమాచార మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లకు రూ.34 వేలకోట్లు, తల్లికి వందనం కింద రూ.10,091 కోట్ల మేర ఆర్థిక సహాయాన్ని అందజేయడమే కాకుండా రైతుభరోసా, దీపం-2, అన్న క్యాంటీన్ల అమలు చేస్తోందన్నారు. అదేవిధంగా ఈనెల 15నుంచి మహిళలకు "ఉచిత బస్ ప్రయాణం" పథకాన్ని అమలవుతుందంటూ.. కూటమి ప్రభుత్వమిచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని పార్థసారథి స్పష్టం చేశారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాచార, ప్రసారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. హెయిర్ కటింగ్ సెలూన్లకు 200 యూనిట్ల వరకు, చేనేతమగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు.

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్మికులకు ప్రభుత్వం పలు రాయితీలు ప్రకటించనుంది. చేనేత మరియు జౌళిరంగాన్ని పటిష్టపర్చేందుకు చేతి మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్, జీఎస్టీపై ఐదు శాతం రాయితీ, చేనేత సహకార పరపతి సంఘాలకు థ్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటుకై చేనేత, జౌళిశాఖ చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెల్పింది. వ్యవసాయ రంగం తదుపరి చేనేత రంగం రెండవ అతిపెద్ద ఉపాధి ప్రదాతగా రాష్ట్రంలో దాదాపు 93,000 చేనేత నేత కుటుంబాలు, 11,488 మరమగ్గాల యూనిట్లు ఉన్నాయి. రాష్ట్రంలో దాదాపు 986 ప్రాథమిక చేనేత సహకార సంఘాలున్నాయి. వాటిలో 428 చురుకుగా పనిచేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. చేనేత ఉత్పత్తులపై విధించిన 5శాతం జీఎస్టీ కారణంగా.. అధిక తయారీ వ్యయంతో పోటీని ఎదుర్కొంటున్న నేతన్నలకు ఊరట కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీని తిరిగి చెల్లించనుంది. మొదటగా ఈ ప్రయోజనాన్ని ఆప్కో, ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు వర్తింపచేస్తారు. ఇందుకు సుమారు రూ.15 కోట్లు ఖర్చవుతుంది.

పర్యాటక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని.. అరకు, భవానీ ఐలాండ్స్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. రూ.900 కోట్ల ఏపీ టీడీసీఎల్ రుణాలకు ప్రభుత్వ హామీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. వైష్ణవి ఇన్ఫ్రా కంపెనీకి 25 ఎకరాల తితిదే భూమిని ఇచ్చేందుకు క్యాబినెట్ అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు.

"ఐదు కేటగిరీ బస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలకు ఉచితబస్సు ప్రయాణం పథకం అమలుచేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీంతో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ ఇలా 8,456 బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలవుతుంది. ఈ పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. ఈ పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పించామన్నారు. ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను ఐడీ ప్రూఫులుగా చూపించాల్సి ఉంటుందన్నారు. ఈ పథకం నాన్‌స్టాప్, అంతర్ రాష్ట్రీయ బస్ సర్వీసులు, ఏ ఇతర కేటగిరీలకు వర్తించదన్నారు. 74 శాతం బస్సుల్లో ఈ అవకాశం కల్పిస్తున్నామని, ఈ పథకం అమలుకు నెలకు రూ.162 కోట్లు, ఏడాదికి దాదాపు రూ.1,942 కోట్ల భారం పడుతుందని, రోజుకు 26.95 లక్షలమందికి లబ్ది చేకూరనుందన్నారు. ఈ ఏడాది అదనంగా 3 వేల విద్యుత్ బస్సుల కొనుగోలుకు చర్యలు చేపట్టామని, వచ్చే రెండేళ్లలో మరో 1,400 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తామన్నారు. డిమాండుకు తగ్గట్టుగా డ్రైవర్లు, మెకానిక్‌ల నియామకాలనూ చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ పథకం అమలులో భాగంగా మహిళా కండక్టర్లకు బాడీ కెమేరాలు, బస్సులలో సీసీ కెమెరాలు అమర్చడం ద్వారా మహిళల, బాలికల భద్రతకు పెద్ద పీట వేశామన్నారు. అలాగే బస్ స్టేషన్లలో మౌలిక వసతులైన ఫ్యాన్లు, మంచి నీటి సౌకర్యం కల్పించనున్నట్టు చెప్పారు. ఈ పథకం అమలుతో తమ ఆదాయంపై ప్రభావం పడుతుందని ఆటో డ్రైవర్లు ఆందోళన చేస్తోన్న దృష్ట్యా ఆయా సంఘాలతో చర్చించి సమస్య పరిష్కరించాలని సీఎం ఆదేశించినట్టు మంత్రి పార్థసారథి వెల్లడించారు. చేనేత కార్మికులకు త్వరలో నేతన్న భరోసా పథకం కింద ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం చేసే కీలక పథకానికి క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆహ్వానించేందుకు పారిశ్రామికవేత్తలకు తక్కువ ధరకే భూముల కేటాయింపు సహా ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు మంత్రివర్గం అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. నూతన బార్ పాలసీలో భాగంగా వైన్ షాపుల తరహాలో బార్లలోనూ కల్లుగీత కార్మికులకు 10 శాతం కేటాయించాలని.. ఫీజులో 50 శాతం రాయితీ ఇచ్చి ప్రోత్సహించాలని తీర్మానించింది. బార్ షాపులకు అనుబంధంగా పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వాలనే ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. బార్ లైసెన్స్ ఫీజును రూ.5 లక్షలుగా నిర్ణయించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు బార్ల వేళలు ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా.. లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే పర్మిట్ రూములు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పార్థసారథి వివరించారు. రాజధాని అమరావతికి సంబంధించి సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే శ్రీకాకుళంలో రక్షిత మంచినీటి సరఫరాపైనా కీలక నిర్ణయం తీసుకున్నారు. శ్రీకాకుళం రక్షిత నీటి సరఫరాకు రూ.5.75 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండ్‌కు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం నియోజకవర్గానికి రూ.8.22 కోట్లు వయబిలిటి గ్యాప్ ఫండ్ విడుదలకు ఆమోదం లభించింది. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ కోసం వివిధ సంస్థలకు చేసిన భూకేటాయింపులు,అలాగే ఆయాకంపెనీలు ప్రభుత్వం అందించే రాయితీల కల్పనకు ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని మహిళలు రాత్రిపూట కూడా పనిచేసేలా చట్ట సవరణకు ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అలాగే రాత్రివేళ పనిచేసే మహిళలకు భద్రత, రవాణా సౌకర్యం కల్పించాలని కంపెనీలకు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు వైఎస్సార్ జిల్లా పేరును ఏపీ ప్రభుత్వం వైఎస్సార్ కడప జిల్లాగా మార్చిన సంగతి తెలిసిందే. ఆమేరకు ఇటీవల ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. బుధవారంజరిగిన మంత్రివర్గ సమావేశంలో వైఎస్సార్ జిల్లా పేరు మార్పుపై విడుదలచేసిన జీవోను కేబినెట్ ఆమోదించింది."కాంప్రహెన్సివ్ ఏపీ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2025" ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని వివిధ జర్నలిస్టు సంఘాలు అభ్యర్థించిన మేరకు నూతనంగా రూపొందించిన మీడియా నిబంధనలలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ల ప్రతినిధులకు అర్హత మేరకు రాష్ట్ర మరియు జిల్లా అక్రిడిటేషన్ కమిటీలలో స్థానం లభించనుంది.సోషల్ మీడియాకి సంబంధించి కూడా ఒక పాలసీని తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు.

పుట్టపర్తి, మొవ్వ, గన్నవరం, గాజువాక మరియు తిరుపతి తదితర ఐదు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన మంజూరు చేయడానికి చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఏపీఐఐసీ ద్వారా రూ.7500 కోట్ల రుణం సమీకరించి పారిశ్రామిక అభివృద్ధికి వినియోగించేందుకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ చేసిన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెల్పింది. ఏఎస్ఆర్ జిల్లాలోని వై.రామవరం మండలాన్ని ఎగువ వై.రామవరం, దిగువ రామవరం రెండు మండలాలుగా విభజించడానికి ప్రాథమిక నోటిఫికేషన్ జారీకి రెవిన్యూ శాఖ చేసిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. చిత్తూరు జిల్లా తమ్మిగానిపల్లె గ్రామంలో 81.227 సెంట్ల ప్రభుత్వ భూమిని ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చిత్తూరులోని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు ఉచితంగా బదిలీ చేయడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపినట్టు సమాచార మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.

---

## ఏపీ గ్రీన్ ఎనర్జీ పాలసీ లక్ష్యం..

# 160 గిగావాట్లు

- 2029 నాటికి పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు పూర్తి
- ఏపీఎస్ఎస్డీసీ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ
- రిలయన్స్ సీబీజీ ప్లాంట్లతో 2.5 లక్షల మందికి ఉపాధి
- గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్‌లో మంత్రి గొట్టిపాటి



విజయవాడ (చైతన్య రథం): రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక విద్యుత్‌రంగాన్ని బలోపేతం చేయడానికి 160 గిగావాట్ల లక్ష్యంతో గ్రీన్ ఎనర్జీ పాలసీని అమలు చేస్తున్నట్లు ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.బుధవారం విజయవాడలో ఏపీఎస్ఎస్డీసీ, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్తంగా నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్‌లో ముఖ్య అతిథిగా మాట్లాడారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పునరుత్పాదక విద్యుత్‌కు ప్రాధాన్యత ఇస్తూ గ్రీన్ ఎనర్జీ పాలసీ తీసుకొచ్చింది. గత ప్రభుత్వపాలనలో పెట్టుబడిదారుల నమ్మకం కోల్పోయినా, సీఎం చంద్రబాబు ప్రెజెంటేషన్‌వల్ల ఇప్పుడు మళ్లీ ఆత్మవిశ్వాసం ఏర్పడింది" అన్నారు.రాయలసీమ ప్రాంతం గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు అనుకూలమైన వాతావరణం కలిగిందని పేర్కొన్నారు.ఇప్పటివరకు అనేక కంపెనీలతో ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుందని,అవన్నీ త్వరలోకార్యరూపం దాల్చనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రారంభ దశలో ఉన్న ప్రాజెక్టులన్నీ 2029నాటికి పూర్తయ్యి వినియోగంలోకి వస్తాయని స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టుల అమలుకు అవసరమైన నైపుణ్యం కోసం ఏపీఎస్ఎస్డీసీ ద్వారా యువతకు శిక్షణనిచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.కూటమి ప్రభుత్వం 20లక్షల ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకు వచ్చినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఇప్పటికే ప్రకాశంజిల్లాలో రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారనిచెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు కాబోయే 500సీబీజీ ప్లాంట్ల ద్వారా 2.5 లక్షలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రైతులకు అదనపు ఆదాయం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లభించి వలసలు తగ్గే అవకాశముందని మంత్రి వివరించారు.

# రాయచోటి, మదనపల్లి మధ్య ట్రాఫిక్ ఐలాండ్

### ప్రణాళిక తయారు చేయాలన్న మంత్రి మండిపల్లి



అమరావతి, (చైతన్యరథం): రాయచోటి, మదనపల్లి మధ్య రహదారిపై ప్రమాదాల నివారణకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర రవాణా, యువజన క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జాతీయ రహదారి ప్రాధికార సంస్థ చైర్మన్ ఆర్కే సింగ్, రాష్ట్ర రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాయచోటి, మదనపల్లి మధ్య ప్రయాణం చేసే వాహనదారుల భద్రత దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత ప్రణాళికలో ఉన్న అండర్ పాస్ స్థానంలో ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నివావరణలో ట్రాఫిక్ ఐలాండ్‌లు కీలకంగా ఉంటాయని పేర్కొన్నారు. అవసరమైన మార్పులు వెంటనే చేపట్టాలని సూచించారు. ఈమేరకు తగిన ప్రణాళికను రూపొందించి త్వరితగతిన అమలు చేయాలనీ, ప్రజల ప్రయాణ భద్రతకు ఎలాంటి తడబాటు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు.

# కొండపికి సాగర్ జలాలు

### చంద్రబాబు, నిమ్మలకు మంత్రి డోలా కృతజ్ఞతలు



కొండపి (చైతన్య రథం): కొండపి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సాగర్ జలాలు కేటాయించినందుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నిమ్మల రామానాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. దర్శి దగ్గర ఒంగోలు బ్రాంచ్ కెనాల్‌నుంచి మూసి వాగులోకి వెలుగు వారిపాలెం దగ్గరనుంచి 0.6 టీఎంసీ నీరు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ... ఇది శుభ పరిణామం, అడిగిన వెంటనే కొండపి నియోజక వర్గానికి సాగర్ జలాలు కేటాయించి నందుకు ముఖ్యమంత్రి, జలవనరుల మంత్రికి కృతజ్ఞతలు. దీనివల్ల కొండపి, మార్కాపురం సంతనూతలపాడు, నియోజకవర్గాలలోని పలు గ్రామాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఇది కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన కానుక అని వారి తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# స్కేటింగ్ క్రీడాకారిణికి మంత్రి మండిపల్లి అభినందనలు

### ఏషియన్ ఛాంప్‌లో జెస్సీరాజ్‌కు సిల్వర్

అమరావతి (చైతన్యరథం): స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీరాజ్ మాత్రపు బుధవారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని విజయవాడ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల దక్షిణ కొరియాలో నిర్వహించిన 20వ ఏషియన్ చాంపియన్‌షిప్ ఇంటర్నేషనల్ స్కేటింగ్ పోటీల్లో జెస్సిరాజ్ సిల్వర్ పతకం సాధించడం గర్వకారణమని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప చేయడంలో ఆమె పాత్రను ప్రశంసించారు. రాష్ట్ర యువతలో క్రీడా ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో మద్దతు అందిస్తుందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు.



# నాయీ బ్రాహ్మణులకు తీపి కబురు

- మరో ఎన్నికల హామీని నిలబెట్టుకున్న కూటమి
- సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- ఉచిత విద్యుత్ పెంపునకు కేబినెట్ ఆమోదం
- మంత్రి సవిత హర్షం, సీఎంకు ధన్యవాదాలు



అమరావతి (చైతన్య రథం): నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన మరో హామీని నెరవేర్చడంపై బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. అర్హులైన నాయీ బ్రాహ్మణులందరికీ ఉచిత విద్యుత్‌ను 150నుంచి 200 యూనిట్లకు పెంచుతూ కేబినెట్ భేటీలో ఆమోదించడంపై సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. గడిచిన ఎన్నికల్లో నాయీ బ్రాహ్మణుల కష్టాలను గుర్తించిన సీఎం చంద్రబాబు ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్ల వరకూ అందిస్తానని హామీ ఇచ్చిన విషయాని మంత్రి గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, బుధవారం సీఎం చంద్రబాబు నేతృత్వంలో సాగిన కేబినెట్ భేటీలో నాయీ బ్రాహ్మణులందరికీ ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతూ మంత్రిమండలి సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కేటగిరీ-2 సర్వీస్‌కింద 40,808 సెలూన్లు గుర్తింపు పొందాయన్నారు. ఈ షాపులన్నింటికీ నెలకు 200 యూనిట్లమేర ఉచిత విద్యుత్ అందించనున్నట్టు వెల్లడించారు. నాయీ బ్రాహ్మణులకు అందించే ఉచిత విద్యుత్‌వల్ల ప్రభుత్వంపై ఏటా రూ.100.20 కోట్లు భారం పడుతోందన్నారు. నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు ఇచ్చే గౌరవ వేతనం రూ.20వేల నుంచి రూ.25 వేలకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. నాయీ బ్రాహ్మణులను అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకురావడమే సీఎం చంద్రబాబు లక్ష్యంగా మంత్రి సవిత విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# ఏపీలో టూరిస్ట్ థీమ్‌పార్కులు

- ప్రతిపాదనలతో మంత్రిని కలిసిన ఇన్వెస్టర్లు
- ప్రాథమికంగా చర్చించిన పర్యాటక మంత్రి
- 'ఓ ప్రేమ' పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్



అమరావతి (చైతన్య రథం): పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా పరుగులు తీస్తోన్న ఏపీ సర్కారు.. ఆ దిశగా వేగంగా అడుగులేస్తోంది. బుధవారం సచివాలయం రెండవ బ్లాక్ కాన్ఫరెన్స్ హాలులో పలువురు ఇన్వెస్టర్లతో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ భేటీ అయ్యారు. సమావేశానికి టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ హాజరయ్యారు. తొలుత పాంజియా ప్రతినిధి ప్రదీప్ మోచర్ల మంత్రి దుర్గేష్‌తో సమావేశమయ్యారు. యూరప్, హాంకాంగ్ తరహా థీమ్ పార్క్‌లను ఏపీలో నెలకొల్పే అంశంపై చర్చ జరిగింది. 5 ఎకరాల విస్తీర్ణంలోరి రూ.35 కోట్ల పెట్టుబడితో భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రాజెక్టు నెలకొల్పేందుకు ప్రతిపాదించారు. అన్ని వయస్కుల వారూ ఆహ్లాదంగా గడిపేలా, క్విట్ ఇండియా, ఖేలో ఇండియా తరహా గేమ్స్ ఆడుకునేలా, వెల్ నెస్ సెంటర్ తరహా ఉపయోగపడేలా, పౌరాణికం ఉట్టిపడేలా ఇండియాలోనే మొట్టమొదటి థీమ్ పార్క్‌ను వైజాగ్‌లో నెలకొల్పుతామని ప్రతిపాదించారు. ఈ సందర్భంగా త్రీడీ మాస్టర్ ప్లాన్‌ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. ఈ క్రమంలో టూరిజం పాలసీని మంత్రి దుర్గేష్, అజయ్ జైన్‌లు వివరించారు. ప్రస్తుత కాలంలో చిన్నారులను మొబైల్ నుంచి దూరం చేసి మానసిక, శారీరక ఆరోగ్యానికి పెద్దపీట వేయాలన్నది తమ ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా ఫిన్లాండ్‌కు సంబంధించిన ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి దుర్గేష్ మాట్లాడారు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అనంతరం తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం పొద్దటూరులో అతిపెద్ద ఎకో ఫ్రెండ్లీ పార్క్ ఎక్స్ పీరియం రూపకర్త, ఛైర్మన్ రామ్ దేవ్‌రావు, మంత్రి దుర్గేష్‌ను కలిశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియం బొటానికల్ గార్డెన్ తరహా పార్క్‌ను ఏపీలో అమరావతి లేదా బీచ్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. ఈ పార్క్ ఏర్పాటుతో మంచి టూరిజం స్పాట్‌గా మారుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పీరియంను సందర్శించాలని రాందేవ్ రావు మంత్రి దుర్గేష్‌ను కోరారు. త్వరలోనే సందర్శిస్తామని అనంతరం నిర్ణయం తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. మరో కంపెనీ అధినేత వైజాగ్‌లో వెల్‌నెస్ సెంటర్లు, 50 టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తామని ముందుకొచ్చారు. అరకు, లంబసింగి, మారేడుమిల్లి, విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. దాదాపు 500 -1000 చదరపు అడుగులు ఉండేలా వుడెన్ హౌసెస్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే తాము ఊటీ, చిరపుంజీ తదితర పర్యాటక ప్రాంతాల్లో ఈ తరహా హౌసెస్ ఏర్పాటు చేసి మంచి ఫలితాలు సాధించామని వివరించారు. ఇవి పర్యాటకులకు మరిచిపోలేని జ్ఞాపకాలను అందిస్తాయని, ఫైవ్‌స్టార్ హొటల్‌లో ఉండే విధంగా తాము నిర్మిస్తామని మంత్రి దుర్గేష్‌కు తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు సమర్పించిన ప్రతిపాదనలను మంత్రి దుర్గేష్ పరిశీలించి సావధానంగా విన్నారు. తదుపరి మీటింగ్ నాటికి మరింత సమాచారంతో రావాలని, అమలు చేసే విషయం గురించి చర్చిద్దామని సూచించారు.

అనంతరం రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, హర్ ఘర్ తిరంగా కార్యక్రమ నోడల్ ఆఫీసర్ రేగుల్ల మల్లికార్జున రావు మంత్రి దుర్గేష్‌ని కలిశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలందరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రోత్సహించడం, ప్రజలలో దేశభక్తిని పెంపొందించడానికి, జాతీయ జెండా గురించి అవగాహన కల్పించడానికి ఉద్దేశించబడిన హర్ ఘర్ తిరంగ కార్యక్రమంపై చర్చించారు.. అదే విధంగా స్క్రీన్ ప్లే పిక్చర్స్ పతాకంపై ప్రవీణ్ కేవీ నిర్మాణంలో చిరంజీవి కృష్ణపల్లి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న "ఓ ప్రేమ" మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. హీరో హీరోయిన్లు సాయి తేజవర్మ, మధుస్మిత, చిత్ర యూనిట్‌కు మంత్ర దుర్గేష్ విషెస్ తెలిపారు.



# జాతీయ ప్రాజెక్టులు పరిగెత్తాలి

- పెండింగ్ సమస్యలను సత్వరం పరిష్కరించుకోవాలి
- నిర్ణీత కాలవ్యవధిలో ప్రాజెక్టులను పూర్తిచేయాలి
- ఎన్‌హెచ్, రైల్వే ప్రాజెక్టులపై టాస్క్ ఫోర్స్ కమిటీ భేటీ
- పలు అంశాలను సమీక్షించిన మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి
- కేంద్ర సహకారాన్ని అందిపుచ్చుకోవాలని సూచన
- 2026నాటికి ప్రాజెక్టులు పూర్తి చేయాలని దిశానిర్దేశం
- గ్రీన్ ఫీల్డ్ పోర్టులతో ఎన్‌హెచ్, రైల్వే అనుసంధానంపై చర్చ



అమరావతి (చైతన్య రథం): జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల పెండింగ్ సమస్యలు త్వరగా పరిష్కరించి.. ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు నిర్దుష్ట కార్యాచరణతో ముందుకెళ్లాని రోడ్లు భవనాల మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయం ఆర్ అండ్ బి కార్యాలయంలో మంత్రి జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన జాతీయ రహదారులు, రైల్వే ఉన్నతాధికారులతో 3వ టాస్క్ ఫోర్స్ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. గతంలో ఏప్రిల్‌లో నిర్వహించిన 2వ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపై సాధించిన ప్రగతిని మంత్రి సమీక్షించారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు భూసేకరణ, అటవీ క్లియరెన్స్‌వంటి పెండింగ్ సమస్యల పరిష్కారం ఎంతవరకూ వచ్చిందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్డీయే ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్న తరుణంలో నేషనల్ హైవేస్ పనులను త్వరతగతిన పూర్తయ్యేలా అధికార్లు పనిచేయాలన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న జాతీయ రహదారుల ప్రాజెక్టుల సంబంధించి 584 కి.మీ రోడ్ల భూసేకరణలో 308కి.మీ భూసేకరణ పూర్తైనట్లు అధికార్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మిగిలిన భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఫారెస్ట్ క్లియరెన్స్ సమస్యలు చాలా వరకు పరిష్కారమైనట్టు అధికారులు మంత్రికి నివేదించారు. ఎన్‌హెచ్ పాజెక్టుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కార్యదర్శి స్థాయిలో వారానికి ఒకసారి సమావేశమై.. శాశ్వత పరిష్కారం దిశగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, సీసీఎల్ఎ జయలక్ష్మీ, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండ్, ప్రాంతీయ అధికారి హరికృష్ణ, ఈఎన్సీ వి రామచంద్ర, ప్రాంతీయ అధికారి ఆర్‌కె సింగ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**రైల్వే ప్రాజెక్టులపై మంత్రి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ సమీక్ష**

2026 డిసెంబర్ నాటికి రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులు పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికార యంత్రాంగం పనిచేయాలని రైల్వే ఉన్నతాధికారులతో నిర్వహించిన 3వ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులపై మంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో 2వ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సాధించిన పురోగతిని సమీక్షించారు..

రామాయపట్నం, మచిలీపట్నం, మూలాపేట పోర్టులకు రైల్వే లైన్ అనుసంధాన పనులను గడువులోపు పూర్తి చేయాలన్నారు. బేతంచెర్ల నంద్యాలలో రైల్వే సబ్ వేల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నడికుడి -శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టుకు అవసరమైన భూములను రైల్వే శాఖకు అందజేయాల్సిందిగా కోరారు. కోటిపల్లి -నర్సాపురం రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి సర్వే పనులను పూర్తిచేసి, భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. అమరావతి -ఎర్రుబాలెం నూతన రైల్వేమార్గం భూసమీకరణ అంశాలపై సీఆర్డీఏ అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా సూచించారు. అన్ని రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన తాత్కాలిక మైనింగ్ పర్మిట్‌లు జాతీయ రహదారులకు ఇచ్చిన తరహాలోనే మంజూరు చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని మంత్రి కోరారు. రైల్వే అధికారులను భూసేకరణ కోర్టు వ్యాజ్యాలలో జాప్యం నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

రాష్ట్రంలో మంజూరైన అన్ని రైల్వే మార్గాలకు భూసేకరణ త్వరగా పూర్తి చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులను మంత్రి ఆదేశించారు. ఆయా జిల్లా కలెక్టర్లతో భూసేకరణ పురోగతిపై ప్రతీ నెలా సమీక్షించాల్సిందిగా ఆదేశించారు. మంజూరైన రైల్వే వంతెన పనులకు లెవల్ క్లోజర్ సర్టిఫికెట్‌లను వెంటనే జారీ చేయాల్సిందిగా సంబంధిత జిల్లా కలెక్టర్‌లను ఆదేశించడానికి ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రైల్వే వంతెన పనులకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాల్సిందిగా మున్సిపల్, పంచాయితీ రాజ్, విద్యుత్ శాఖ అధికారులను కోరారు. కోరాపూట్ -కొత్త వలస రైల్వే లైన్ అటవీ అనుమతుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది. అమృత్ భారత్‌లో మంజూరైన అన్ని రైల్వే స్టేషన్‌లను ఈ ఏడాదిలో పూర్తి చేయడానికి సంకల్పించారు. నిర్మాణంలో ఉన్న అన్ని రైల్వే ప్రాజెక్టులను 2026 డిసెంబర్‌లోగా పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిందిగా మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, సౌత్ సెంట్రల్ రైల్వే సీఈ నాగభూషణం, ఈస్ట్ కోస్ట్ రైల్వే సీఈ శ్రీనివాస్, రైల్వే సేఫ్టీ ప్రాజెక్ట్ సీఈ మనోజ్‌కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.,

**గ్రీన్ ఫీల్డ్ పోర్టుల అనుసంధానంపై సమీక్ష**

మారిటైమ్ బోర్డు ఆధ్వర్యంలో రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న 3 గ్రీన్ ఫీల్డ్ పోర్టులు రామాయపట్నం, మచిలీపట్నం, మూలాపేట పోర్టులకు సంబంధించిన కనెక్టివిటీ రోడ్లను జాతీయ రహదారులతో త్వరితగతిన అనుసంధానించాలని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో మారిటైమ్ బోర్డుకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి పలు అంశాలపై మంత్రి ఆ శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. రాష్ట్రంలోని పోర్టులతో నేషనల్ హైవేలు, రైల్వే లైన్లకు అనుసంధానంలో కొన్నిచోట్ల తలెత్తిన పెండింగ్ సమస్యలు పరిష్కరించడం ద్వారా సీ పోర్టుల నిర్మాణం సకాలంలో పూర్తికావడానికి తోడ్పాటు అందించినట్లవుతుందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు.

మారిటైమ్ బోర్డు అధికారులు లేవనెత్తిన పలు పెండింగ్ అంశాలు, గ్రీన్ ఫీల్డ్ పోర్టులకు రహదారుల అనుసంధానం వంటి సమస్యలను సాధ్యమైనంత వేగంగా పరిష్కరించి, వాటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాల్సిందిగా మంత్రి ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో నిర్మాణంలోవున్న రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట ఓడరేవులకు రైల్వే లైన్ల పనులను కూడా త్వరితగతిన ప్రారంభించాల్సిందిగా అధికారులను మంత్రి ఆదేశించారు.. గ్రీన్ ఫీల్డ్ పోర్టులకు సంబంధించి పోర్టు రైల్వే సైడింగ్‌కు సంబంధించి రైల్వే అధికారులతో చర్చించారు. రామాయపట్నం పోర్టు రైల్వే సైడింగ్‌కు సంబంధించిన పనులు వేగవంతం చేయవల్సిందిగా మంత్రి రైల్వే అధికారులను ఆదేశించారు.. మచిలీపట్నం పోర్టుకు సంబంధించిన పోర్టు సైడింగ్స్ యొక్క ఇంజనీరింగ్ స్కేల్డ్ ప్లాన్స్ అనుమతులు త్వరితగతిని ఇవ్వాలని రైల్వే అధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఆర్ యువరాజ్, మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, మారిటైం బోర్డు సీఈ జీవీ రాఘవరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ద్వారంపూడి అనుచరుడి దందా

- వైసీపీ మాజీ ఎమ్మెల్యే అండతో ఆగడాలు
- తన ఇంటిని అక్రమ రిజిస్ట్రేషన్ చేశాడంటూ మహిళ ఆవేదన
- మంగళగిరి కేంద్ర కార్యాలయంలో ప్రజావేదిక
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు

మంగళగిరి (చైతన్యరథం): కాకినాడ జిల్లా జగన్నాధపురం నక్కవారి వీధికి చెందిన అనుముల కాంచన దుర్గ బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు. తాము అవసరాల నిమిత్తం ఇంటిని చోడిపల్లి అవినాష్ రామ్ అనే వ్యక్తివద్ద తాకట్టు పెట్టామన్నారు. తరువాత సగం డబ్బులు తిరిగి చెల్లించాక కూడా అతను అక్రమంగా తమ ఇంటిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేసి మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. అతను మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రధాన అనుచరుడని వెల్లడించారు. ఈ నేపథ్యంతో తమను బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. అతనిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబులకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు. ప్రకాశం జిల్లా పెద్దచెర్లోపల్లి మండలం తలకొండ పాడు గ్రామానికి చెందిన పూజల నాగేంద్ర ప్రసాద్ గోడు వెళ్లబోసుకుంటూ అర్జీ ఇచ్చాడు.తమ గ్రామంలో పంచాయతీ నిధుల దుర్వినియోగం జరిగిందని అధి కారులు విచారించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. కడప జిల్లా చాపాడు మండలం అనంత పురం గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి తన ఆవేదనను వ్యక్తంచేశాడు. 2018-2019లో తాను ఎన్ఆర్ ఈజీఎస్ క్రింద వర్క్ చేశానని. దానికి గాను తనకు బిల్లులు పెండింగ్ ఉన్నాయని దయచేసి తనకు రావాల్సిన బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని అభ్యర్థిం చారు. కృష్ణా జిల్లా నాగాయలంక మండలం పరశివర గ్రామానికి చెందిన ఆదిశేషు నాగాయలంక పోలీస్ స్టేషన్‌లో గత పదిసంవత్సరాల నుండి స్వీపర్ గా పనిచేస్తున్నాడు. కానీ ఇప్పటి వరకు జీతం ఇవ్వలేదని దయచేసి తనకు రావాల్సిన జీతం ఇప్పించాలని వేడుకున్నాడు. ఎస్సీల పేరుతో ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ప్లాట్స్‌గా మార్చి అమ్మేస్తున్న ఏసేబుపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాలని కర్నూలు జిల్లా ఓర్వకల్లు గ్రామానికి చెందిన గోవిందరెడ్డి కోరాడు.





## ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

- స్టేట్ హజ్ కమిటీ ఛైర్మన్



అమరావతి(చైతన్యరథం): విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను తిరిగి పునరుద్ధరించడంలో చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలోని హజ్ కమిటీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిటీ ఛైర్మన్ హసన్ బాషా మాట్లాడుతూ మన రాష్ట్రానికి సెంట్రల్ హజ్ కమిటీ 2550 మందికి హజ్ యాత్రకు అవకాశం కల్పించిందన్నారు. గతేడాది విజయవాడ నుంచి పవిత్ర మక్కా యాత్రకు దరఖాస్తు చేసుకున్న 72మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున కూటమి ప్రభుత్వం అందచేయడం హర్షణీయమన్నారు. ఈ ఏడాది పవిత్ర మక్కా యాత్రకు వెళ్లే యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను ఎంపిక చేసుకోవాలని పిలుపునిచ్చారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ఎంపిక చేసుకున్న యాత్రికులకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఇప్పటికే 1900మందికిపైగా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాల్సిన అవసరాన్ని సెంట్రల్ హజ్ కమిటీ దృష్టికి తీసుకెళ్ళామన్నారు. హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ హుస్సేన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని రుజువు చేసిందన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ సాధించి చూపించిందన్నారు. మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా పవిత్ర మక్కా యాత్ర చేసిన హజ్ యాత్రికులకు రూ.లక్ష అందించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో హబీబుల్లా, మహమ్మద్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పులొప్పుకో.. లెంపలేసుకో!!

- జనానికి జగన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి
- మద్యం స్కాంలో తవ్వేకొద్దీ సంచలన నిజాలు
- వైసీపీ నేతలు చేసిన తప్పిదాలను ఒప్పుకొని జైలుకెళ్లాలి
- ఏపీఎస్‌ఏడీప ఛైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి డిమాండ్




మంగళగిరి (చైతన్యరథం): జగన్‌రెడ్డి అమ్మిన బ్రాండ్లపై ఎన్ని మీడియా సమా వేశాలు జరిపినా, వైసీపీ నాయకులకు కను విప్పు కలగలేదని కనీసం మార్పు రాలేదని ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి విరుచుకు పడ్డారు. జగన్‌రెడ్డి గత ఐదేళ్లు రకరకాల బ్రాండ్లు అమ్మారని ఆరోపించారు. నాసి రకం మద్యంపై ల్యాబ్ రిపోర్టులు కూడా బయట పెట్టామన్నారు. అయిన కూడా నాసిరకం మద్యం అమ్మారన్నారు. నాసి రకం మద్యం తాగి ప్రజలు చనిపోతున్నా రని చెప్పిన కూడా వైసీపీ నాయకులు ఆరోజు వినలేదన్నారు. ఈరోజు దొంగ కేసులంటూ ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో డిజిటల్ చెల్లింపులు లేకుండా పూర్తిగా నగదు రూపంలో మద్యం అమ్మకాలు జరిపి వేల కోట్లు దోచుకున్నారన్నారు. డిస్టిలరీలను బెదిరించి, కత్తిపెట్టి జగన్ రెడ్డి లీజుకు తీసుకున్నాడన్నారు. లక్ష రూపాయలతో స్థాపించిన ఆదానీ కంపెనీకి 5 నెలల్లో రూ.250 కోట్ల ఆర్డర్లు ఇచ్చారని ఆరోపించారు. గజదొంగలైన వైసీపీ నాయకులు వారిపై కొత్త కేసులు పెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో ఉన్న బ్రాండ్లు ఇప్పుడు ఒక్కటైనా ఉన్నాయా.. 7హార్స్ బ్రాండ్లు అమ్మారు..11 సీట్లకు దిగజారారన్నారు. జగన్ రెడ్డి బ్రాండ్ల వల్ల ఎన్ని తాళిబొట్లు తెగిపోయయో వైసీపీ నాయకులు సమాధానం చెప్పగలరా అని నిలదీశారు. ఎన్ని తాళిబొట్లు తెంచితే సిట్ మీపై విచారణ వేస్తుందో తేటతెల్లమయిందన్నారు. ఎంతమంది ప్రాణాలు తీస్తే, ఎంత మంది తాళిబొట్లు తెంచితే, ఎంత డబ్బు వస్తే జగన్ రెడ్డి సుఖంగా ఉంటారు? మీ బ్రాండ్ల వల్ల చనిపోయిన ఆత్మలే మిమ్మల్ని ఓడించాయని పేర్కొన్నారు. వెంకటేష్ నాయుడు ఎవరు? చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుచరుడు కాదా? రాజ్ కెసిరెడ్డి వైఎస్ సుజాత రెడ్డి అల్లుడు కాదా? మీ బంధువు కాదా..? కాదని చెప్పే దమ్ము జగన్‌కు ఉందా..? అని సవాలు విసిరారు. ఆదాన్ డిస్టిలరీలో ముప్పిడి అవినాష్, రాజ్ కెసిరెడ్డికి తోడల్లుడని అందరికీ తెలుసు, అయినా ఎట్లా చెబుతారు మీకు సంబంధంలేదని..లిక్కర్ స్కాంలో వేల కోట్లు తిన్నారు.. రాజ్ కెసిరెడ్డి, మిథున్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, చెవిరెడ్డితో సంబంధం లేదని జగన్ రెడ్డి చెప్పగలరా? అని ప్రశ్నించారు. గత ఐదేళ్లు వైసీపీ నాయకులు రాజభోగాలు అనుభవించారని వివరించారు. వీటన్నింటికి జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విజయసాయిరెడ్డి జగన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు కాదా? లిక్కర్ స్కామ్‌లో డబ్బు పంచుకోలేదా? విజయసాయిరెడ్డి వైజాగ్ ఇన్చార్జి కాదా..? వీళ్లతో సంబంధం లేదని సిగ్గులేకుండా ఎలా చెబుతారు..? లిక్కర్ స్కామ్ జరిగింది..మద్యం ద్వారా డబ్బులు సంపాదించామని విజయసాయరెడ్డి చెప్పిన తరువాత వైసీపీలో ఉన్న ప్రతి నాయకుడికి లిక్కర్ స్కామ్‌తో సంబంధం ఉందని స్పష్టమయిందన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉంటే స్కాం ఎలా జరుగుతుందని వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని, తమిళనాడులో 25 సంవత్సరాలుగా ప్రభుత్వ మద్యం షాపులు నడుస్తున్నాయన్నారు. కానీ ఇక్కడ ప్రభుత్వం మద్యం దుకాణాల్లో రూ.1000 కోట్లు మనీలాండరింగ్ జరిగిందని ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో చూసిన తరువాత వైసీపీ నాయకులు అక్కడకు వెళ్లి స్కాం చేయడానికి ఏపీలో ప్రభుత్వం మద్యం దుకాణాలు పెట్టారని అనుమానం కలుగుతోందన్నారు. ప్రభుత్వం దుకాణాలు పెట్టింది స్కాం చేయడానికేనన్నారు. వైసీపీ నాయకులు రాజభోగాలు చూస్తే ఆశ్చర్యం వేస్తుందన్నారు. వైసీపీ పాలనలో మద్యం స్కాంకు ఎన్ని విమానాలు, ఎన్నిసార్లు ఉపయోగించారు, విమానాలకు ఎంత డబ్బులు కట్టారు.. ఎంత మంది ప్రయాణించారో దర్యాప్తు చేయాలన్నారు. వెంకటేష్ నాయుడు సంవత్సరానికి రూ.4లక్షల ట్యాక్స్ కట్టే వ్యక్తి ఎలా స్పెషల్ ఫ్లయిట్ ఎక్కారన్నారు. సొంత కారు కూడా లేని వ్యక్తి ఒంగోలులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి అనుకూలంగా డమ్మీ నామినేషన్ ఎలా వేశాడో కూడా బయటపెట్టాలన్నారు. ఎంత సంపాదిస్తే హీరోయిన్లతో ఫ్లయిట్‌లో ప్రయాణిస్తాడన్నారు. వైసీపీ నాయకుల లీగల్ సెల్‌ను ప్రతిష్టంగా చేయాలని జగన్ మాట్లాడుతున్నాడు ...చేసిన దొంగ పనులకు, పడుతున్న కేసులకు లీగల్ సెల్ కావాల్సి వచ్చిందని ఎద్దేవా చేశారు. వైసీపీ పార్టీ ఆఫీస్ మూసి, లీగల్ సెల్ ఇచ్చిన వ్యక్తిగా జగన్ చరిత్రలో నిలిచిపోతాడన్నారు. తప్పు చేశామని జగన్ రెడ్డి బయటికొచ్చి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మద్యం స్కాంలో క్లైమాక్స్‌కు వచ్చిందన్నారు. అనుకునేలోపు తవ్వేకొద్ది సంచలన విషయాలు బయటకు వస్తున్నాయన్నారు. వర్ధన్ మాన్ కాలేజీలో దొరికిన రూ.11 కోట్లు వైసీపీ నాయకులవి కాకపోతే ఎవరి..అక్కడ డబ్బులు ఉన్నాయని చెప్పింది ఎవరు.. జగన్‌రెడ్డి చెప్పాలని డిమాండ చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను ఈ కూటమి ప్రభుత్వంలో జరగకుండా చూస్తున్నామన్నారు. గతంలో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చుకునేవారమని ఇప్పుడు మన రాష్ట్రం నుంచి పొరుగు రాష్ట్రాల వారు మద్యం తీసుకెళ్లే పరిస్థితి వచ్చిందని విచారం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం మద్యం పాలసీ వల్ల తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ వంటి పొరుగు రాష్ట్రాలకు ఆదాయం తగ్గిందన్నారు. గత ఐదేళ్లు వైసీపీ నాయకులు చేసిన తప్పులను ఒప్పుకొని జైలుకి వెళ్లాలని ఆయన సూచించారు..

# వైసీపీ చేష్టలకు సిగ్గుపడుతున్న గురివిందలు

## గతాన్ని మరచి.. న్యాయం, ధర్మం అంటూ గగ్గోలు!

తప్పుడు సాక్ష్యాలతో అక్రమ కేసులు పెట్టి గిట్టని వారిని జైల్లో పెడుతున్నారని, 14 నెలలుగా రాష్ట్రంలో అన్యాయమైన పాలన సాగుతోందని, న్యాయం, ధర్మం అనేది ఎక్కడా కనిపించడం లేదని, గిట్టని వారిపై దొంగ సాక్ష్యాలు సృష్టించి కేసులు పెడుతున్నారని, ఎవరైనా స్వరంగట్టిగా వినిపిస్తే తట్టుకోలేకపోతున్నారని, ఎలాగైనా తీసుకుపోయి వారిని జైల్లో పెట్టాలని, పరువు తీయాలని కుట్రచేస్తున్నారని, తప్పు చేయకపోయినా బురదవేస్తున్నారని, కలియుగం అంటే ఏమిటనేది చంద్రబాబు 14 నెలల పాలనచూస్తే తెలుస్తుందని, ఒక మనిషిని జైలులో పెట్టడం అంటే ఆ వ్యక్తి పరువు ప్రతిష్టలతో ఆడుకోవడమేనని, ఎక్కడా న్యాయం, ధర్మం లేదని, రాష్ట్రంలో కూటమి పాలన అన్యాయంగా సాగుతోందని, ఆధారాలు లేని కేసులు పెట్టి వైసీపీ నాయకులను వేధిస్తున్నారని లీగల్‌సెల్ సమావేశంలో వైఎస్ జగన్ ఘోషించారు. వైసీపీ నాయకులపై పెట్టిన కేసుల్లో ఎక్కడా ఆధారాలు లేవని, జగన్ రెడ్డి పత్తిత్తు కబుర్లు చెప్పడం చూసి గిరివిందలు సిగ్గు పడుతున్నాయి..అయిదేళ్లు నిరంకుశ రాజ్యాన్ని ఏలిన మీరు ఇప్పుడు అమాయక ముఖం పెట్టి కూటమి పాలన అన్యాయంగా సాగుతుందని, ధర్మం-న్యాయం లేదని శోకాలు పెట్టడం చూసి ప్రజలు కరిగి పోవడం లేదు . ఉచ్ఛనీచాలు మరచి ప్రవర్తించి రాజధర్మాన్ని పాటించాలన్న స్పృహ కూడా లేకుండా వ్యవహరించి నేడు ధర్మ స్తోత్రాలు వల్లిస్తే సరిపోతుందా?అన్ని వర్గాలనూ వెంటాడి వేధించిన మీరు, ధర్మం-న్యాయం లేదని నక్క వినయాలు ప్రదర్శిస్తారా ?అసలు మీకు ధర్మం-న్యాయం అంటూ వాపోయే అర్హత ఉన్నదా ? పోలీసులను అడ్డం పెట్టుకొని దమన నీతికి పాల్పడటం న్యాయం కాదని, అన్యాయం అని ఆ రోజు తెలియదా? అన్యాయం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? ప్రజాస్వామ్య బద్ధంగా, న్యాయ, ధర్మ బద్ధంగా వ్యవహరించి ఉంటే, నేడు అన్యాయం గురించి శోకాలుపెట్టాల్సిన దుస్థితిఉండేది కాదు కదా? నీతిమాలిన రాజకీయాలుచేసి అన్యాయ సూక్తులు వల్లిస్తున్నారు. మీ అంత నీచమైన, సిగ్గు మాలిన, రాక్షస పరిపాలన దేశంలో ఎవరైనా చేశారా? అయిదేళ్లు రాక్షస పాలనతో రాష్ట్రాన్ని రావణ కాష్టం చేసిన జగన్మోహన్ రెడ్డి ఒక్క రోజైనా న్యాయం, ధర్మం గురించి ఆలోచించారా? వెనకటికి ఒకడు చేసిన పాపాలు గోచిలో దాచి పెట్టి కాశీకి పోయి హర,హరా అన్నాడట. జగన్‌రెడ్డి సూక్తులు కూడా అలాగేవున్నాయి. ఇప్పుడు అమాయక ముఖం పెట్టి న్యాయం, ధర్మం అంటూ గతం మరచి గగ్గోలు పెడుతున్నారు. మేకతోలు కప్పుకున్న జగన్ రెడ్డి చరిత్ర ప్రజలకు తెలియనిది కాదు. ముఖ్యమంత్రిగా కాకుండా కరుడు గట్టిన ప్యాక్షనిస్టుగా, నీతి మాలిన రాజకీయాలు చేసారు. అధికారం అంటే అహంకారం కాదు, బాధ్యతతో కూడినప్రజా సేవ. ప్రజాస్వామ్యంలో వ్యక్తిపూజ, నిరంకుశత్వ అవకాశవాద ఓటు బ్యాంకు రాజకీయాలు చెల్లవని జనం కర్రు కాల్చివాత పెట్టారు. మూర్ఖ చర్యలతో నియంతృత్వ పోకడలతో, దురంకార పాలనతో ఆంధ్రప్రదేశ్‌ను అధోగతి పాలు చేసి, జనాన్ని పీడించి జనం చేతిలో చావు దెబ్బ తిన్న తరువాత కూడా ఆయనలో మార్పు రావడం లేదు. అట్లాగే అమరావతి నిర్మాణం పేరుతో యథేచ్ఛగా దోచేస్తున్నారని ఆరోపించారు. ఇన్ని అబద్ధాలు చెప్పి, ఇన్ని మోసాలు, దారుణాలు చేస్తున్నవారిని దేవుడు, ప్రజలు తంతే ఎక్కడ పడతారో..నేను ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదన్నారు జగన్. జనం తంతే తానూఎక్కడ పడ్డాడో ముందు తెలుసుకొన్నందుకు సంతోషం. రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసి వేల కోట్లు పోగేసుకొన్న జగన్, అమరావతిలో అవినీతి జరుగుతున్నట్లు గుండెలు బాదుకుంటున్న జగన్ రెడ్డి అసలు నీ చరిత్రేమిటి? నీ హయాంలో జరిగిన భాగోతాలకు, మద్యం దందాలను ముందు చెప్ప గలవా? రాష్ట్రానికి పట్టిన పీడ వదిలించుకొని ప్రజలు సంబరాలు చేసుకొన్నారు. మరోసారి జగన్‌ని భరించడానికి ప్రజలు సిద్ధంగా లేరు. గతంలో ఒక్క ఛాన్స్ అనగానే జనం జాలిపడ్డారు. జగన్‌లో వున్న అసలైన అంతర్ముఖుడిని గుర్తించకుండా గంపలకొద్దీ ఓట్లు వేసి ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టారు. ఆ తర్వాత జగన్ విశ్వరూపం ఏమిటో ప్రతి సందర్భంలోనూ ప్రజలు చూసారు. అధికారం ఇస్తే ఆంధ్రప్రదేశ్ అంతా అలికి ముగ్గులు పెడతానన్న జగన్ విధ్వంస పాలనలో ఆంధ్రప్రదేశ్ అస్తవ్యస్తం అయింది. అయినా ఏదో జనాన్ని ఉద్ధరించినట్లు బాధపడిపోవడం రోతగా వుంది . ప్రజాశ్రేయస్సు పట్టించుకోకుండా నిరంకుశ,పాసిష్ఠ పాలనతో,ధన దాహంతో రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్ రెడ్డి సిగ్గు లేకుండా న్యాయం,ధర్మం అంటూ చేస్తున్న స్తోత్రాలను ప్రజలు నమ్మరు. అట్లాగేఅమరావతి నిర్మాణం పేరుతో యథేచ్ఛగా దోచేస్తున్నారని ఆరోపించారు. ఇన్ని అబద్ధాలు చెప్పి, ఇన్ని మోసాలు, దారుణాలు చేస్తున్నవారిని దేవుడు, ప్రజలు తంతే ఎక్కడ పడతారో.. నేను ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదన్నారు జగన్. జనం తంతే తానూ ఎక్కడ పడ్డాడో ముందు తెలుసుకొన్నందుకు సంతోషం. ఐదేళ్ల ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సంకెళ్లు, ఎదురు తిరిగితే జైళ్ళు అన్న విధంగా వ్యవహరించారు. 3,500కు పైగాతెలుగుదేశం నాయకులపై అక్రమ కేసులు పెట్టారు. 3000 మందికి పైగా అరెస్టు చేసి జైల్లో పెట్టారు. చంద్రబాబుపై ఒక్క బాబ్లీ కేసు మాత్రమే ఉండేది. జగన్ హయాంలో 17 కేసులు పెట్టారు. తాడూ బొంగరం లేని స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును 53 రోజులు జైలుకు పంపి అహం చల్లార్చుకున్నారు. ఆ కేసులో ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని బెదిరించి చంద్రబాబుకు వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం చెప్పించారు. ఆ అధికారిని తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించుకొని తనను జైలుకు పంపించిన చంద్రబాబును ఇప్పుడు జైలుకు పంపాలని మీరు చంద్రబాబుకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వాల్సిందే అని ధనుంజయ్ రెడ్డి బెదిరించారు. చెయ్యని నేరానికి చంద్రబాబును రిమాండ్‌కు పంపి 53 రోజులు జైలులో నిర్బంధించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై 66 కేసులు పెట్టారు. సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయని ధూళిపాళ్ల నరేంద్రను జైల్లో పెట్టారు. అక్రమ కేసు పెట్టి కొల్లు రవీంద్రను 50 రోజులకు పైగా జైలులో పెట్టారు. అచ్చెన్నాయుడును 70 రోజులు జైలులో పెట్టారు. మాజీ స్పీకరు కోడెల శివప్రసాదరావుపై 18 కేసులు పెట్టారు. ఆ అవమానం తట్టుకోలేక ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి ఎంపీ రఘురామకృష్ణరాజును లాకప్‌లో పెట్టి చిత్రహింసలకు గురిచేశారు. రాష్ట్రంలో చట్టబద్ద పాలనకు సమాధి కట్టి పోలీస్ రాజ్యం స్థాపించారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ విధంగా నిరంకుశంగా, అప్రజాస్వామిక రీతిలో పరిపాలించలేదు. విలువలను, వ్యవస్థలను, పౌరహక్కులను, భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాసి రాష్ట్రంలో అరాచకానికి. అశాంతికి తెరతీసిన జగన్ రెడ్డి అన్యాయం, ధర్మం-న్యాయం అంటూ గతం మరచి గగ్గోలు పెడుతూ నీతి సూత్రాలు వల్లిస్తారా?

- నీరుకొండ ప్రసాద్

## అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

● రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి హామీ



దేవీపట్నం (చైతన్యరథం): అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే శిరీషదేవి వ్యాఖ్యానించారు. బుధవారం ఎస్. రామన్నపాలెంలో అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదంలో బాధపడిన కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఆధారముగా నిలుస్తామని, అవసరమైన ప్రభుత్వ సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గత రాత్రి చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో కుక్క అప్పయమ్మ, కుక్క వెంకటేశ్వరరావు తదితర కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే వారికి బియ్యం, కూరగాయలు, ఆర్థిక సాయం అందజేశారు. ప్రమాదం జరిగిన తీరుపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులను ఓదార్చారు మరియు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోళ్ళ చంటిబాబు, ముంద్రు మధుసూదనరావు, తైలం గంగాధరం, జొన్నల శ్రీనివాస్ కుమార్, డైరెక్టర్ జొన్నల రాంబాబు, దాకారపు సత్యనారాయణ, సర్పంచ్ కుంజ రాజామణి, కొత్తపల్లి అన్నవరం, రేలంగి రాంబాబు, కంగల పోశమ్మ, తహసీల్దార్ సత్యనారాయణ, సాల్మన్ రాజ్, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## పాడేరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

● పాల్గొననున్న సీఎం నారా చంద్రబాబునాయుడు...

● ఏర్పాట్లు పరిశీలించిన టీడీపీ నేతలు



పాడేరు (చైతన్యరథం): అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వస్తున్నారన్న సమాచారంతో సీఎం ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ బుధవారం లగిసపల్లి ప్రదేశంలో హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆదివాసీ దినోత్సవం వంజంగి గ్రామంలో జరుగుతున్న స్థల పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావాలని ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివాసీ దినోత్సవం జరపడం ఆదివాసులకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాడేరు ఇన్‌ఛార్జ్ గిడ్డి ఈశ్వరి, మాజీ ఎంపిపి బొర్రా విజయరాణి, సర్పంచ్‌లు పాంగి పాండురంగ స్వామి, బాకూరు వెంకటరమణ రాజు, శశి భూషణ్, తమర్భ సత్యనారాయణ, పార్వతి, మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, బుజ్జి, మహేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఎన్నికల్లో కూటమి ఘనవిజయం

విశాఖపట్నం మహా నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలను ఇప్పటికే కూటమిలోని పార్టీలు కైవసం చేసుకున్నాయి. బుధవారం తాజాగా జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాల్లో సైతం మెజార్టీ స్థానాలు కూటమిలోని పార్టీ అభ్యర్థులకే దక్కాయి. మొత్తం 10 స్థానాల్లో తొమ్మిది కూటమి.. కేవలం ఒక్క స్థానం మాత్రం వైసీపీకి దక్కింది. అంటే 8 స్థానాల్లో టీడీపీ, ఒక్క స్థానంలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. వైసీపీ అతి కష్టం మీద ఈ సీటును గెలుచుకుందని తెలుస్తోంది. ఇక ఈ జీవీఎంసీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగిందని వైసీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే గతేడాది స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో కూటమి క్లీన్ స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. కానీ ఈ సారి మాత్రం కూటమి తొమ్మిది స్థానాలను కైవసం చేసుకుంది. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 వరకు ఈ ఓటింగ్ ప్రక్రియ జరిగింది. ఈ ఎన్నికల్లో మొత్తం 92 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తుంది. కూటమి అభ్యర్థులు గెలుపొందడంతో కార్పొరేషన్ కార్యాలయం వద్ద పండగ వాతావరణం నెలకొంది.

# రైతన్న పంటను దాచుకో ధరొచ్చాకే అమ్ముకో




అమరావతి (చైతన్యరథం): రైతులు పండించిన పంటకు సరైన ధర రాకపోతే వచ్చినంత వరకు ఉత్పత్తులను గోదాముల్లో ఉంచుకునే వెసులుబాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. వైఎస్సార్సీపీ హయాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) గోదాములను గాలికి వదిలేశారు. దీంతో అన్నదాతలు తాము పండించిన పంటను నిల్వ చేసుకునేందుకు అవకాశం కలగలేదు. మరోవైపు కర్షకులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను నష్టభయంతో దళారులకు తక్కువ ధరకే ఇచ్చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ పీఏసీఎస్ గోదాములను వినియోగించుకుని, జాతీయ గిడ్డంగుల అభివృద్ధి నియంత్రణ సంస్థతో అనుసంధానం చేయనుంది.

**16 గోదాముల భవనాలు పూర్తి**: శ్రీకాకుళం జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో 16 గోదాముల భవనాలు పూర్తయ్యాయి. మరో తొమ్మిది నిర్మాణ దశలో ఉన్నాయి. తొలి విడతగా 16 గోదాములను జాతీయ గిడ్డంగుల అభివృద్ధి నియంత్రణ సంస్థలో అనుసంధానం చేయనున్నారు. ఈ గోదాములు 500 మెట్రిక్ టన్నుల సరకు నిల్వ చేసే సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఏటా జిల్లాలో లక్షల ఎకరాల్లో వరి, వ్యవసాయ అనుబంధ రంగాల పంటలను రైతులు పండిస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో పండించే వరి, మొక్కజొన్న, మినుములు, పెసర, వేరుశెనగ ఇతర పంటలను గోదాముల్లో నిల్వ ఉంచుకుని గిట్టుబాటు ధర ఉన్నప్పుడు విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో 30 మండలాల్లోని రైతులు గోదాములను ఉపయోగించుకునేలా జిల్లా సహకార సంస్థ అందుకు తగిన ఏర్పాట్లు చేసింది. నిల్వ చేసిన పంట ఉత్పత్తులపై బ్యాంకులు 7 శాతం వడ్డీకే 75 శాతం రుణం ఇవ్వడంతోపాటు సరుకులకు బీమా సౌకర్యం కూడా కల్పిస్తారు.

**సద్వినియోగం చేసుకోవాలి :** రైతులు అందరూ ఈ గోదాములను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా సహకార శాఖఅధికారి నగేష్ తెలిపారు. నిల్వ చేసిన పంట ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్‌లో ధరలు లేకపోతే ప్రభుత్వమే జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సంఘాల సమైక్య ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తుందని చెప్పారు.

## రోడ్డు వచ్చిందన్న సంతోషంలో ఆదివాసీల దింసా నృత్యం

● నడక, డోలి కట్టాల్సిన పనిలేదంటూ ఆనంద వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు



అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో ఆ 11 గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. దీంతో ఆ ఆదివాసీలు కష్టాలు అన్నీ కావు. అత్యవసరమైనా అనారోగ్యమైనా.. కిలోమీటర్లు నడవాల్సిందే.. డోలి కట్టాల్సిందే.. రోడ్డు కోసం అధికారుల చుట్టూ తిరిగారు.. కనిపించిన నేతలను విన్నవించారు. ఎట్టకేలకు వీరి కల సాకారం అయ్యే రోజు వచ్చింది. రోడ్డు పనులు ప్రారంభించడంతో గిరిజనులంతా ఆనందంతో ఉబ్బితబ్బియ్యారు. దింసా నృత్యం చేసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. భూమి పనులు ప్రారంభించిన పొక్లెన్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతగిరి మండలం జీనపాడు, పెదకోట, పిన్నకోట తదితర పంచాయతీల పరిధిలో 11 కొండ శిఖర గ్రామాలున్నాయి. సుమారు 2 వేల మంది జనాభా నివసిస్తున్నారు. బల్లగరువు నుంచి వాజంగి మీదుగా, దాయర్తి నుంచి మద్రేబు మీదుగా తునిసీబు వరకు 12కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు విడుదలయ్యాయి. జనవరి నెలలోనే నిధులు మంజూరు అయినప్పటికీ.. పనులు ప్రారంభం కాలేదు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. గతేడాది డిసెంబర్ 20న బల్లగరువు నుంచి వాజంగి వరకు నడక దారిన వెళ్లి గిరిజనుల కష్టాల్ని స్వయంగా చూశారు. గుమ్మంతి నుంచి రాచకియం వయా రెడ్డిపాడు వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన కూడా చేశారు. అయినా పనులు ప్రారంభం కాలేదు. మళ్ళీ మా పరిస్థితి అంతేనా.. సమస్య మొదటి వచ్చిందా అని ఆ గిరిజనులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఎనిమిది నెలలకు పనులు ప్రారంభమయ్యాయి. దీంతో మా గ్రామానికి రోడ్డు వస్తుందోచ్ అంటూ 11 గ్రామాల గిరిజనులు ఆనందంతో దింసా డాన్స్ చేశారు. రోడ్డు నిర్మాణ పనుల కోసం వచ్చినప్పుడు ప్రొక్లెయిన్ కు పూజలు చేశారు. రోడ్డు రావడానికి ప్రత్యేక శ్రద్ధ చూపిన పవన్ కల్యాణ్‌కు, సీఎం చంద్రబాబుకు కూటమి ప్రభుత్వానికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తిగా గిరిజన సంప్రదాయంలో జరిగింది.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే మామిడి



ఎల్ఎన్‌పేట (చైతన్యరథం): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరణోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఖరీఫ్‌లో రైతులకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థిక సాయాన్ని అందించారన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతులు అన్ని విధాలుగా నష్టపోయారన్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడిగా కె.మన్మథరావు, డైరెక్టర్లుగా వై.రాంబాబు, కె.శ్రీనుతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి, నాయకులు వి.ఆనందరావు, ఎస్.కిషోర్‌కుమార్, సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.తేజేశ్వరరావు, వి.గోవిందరావు, కె.తిరుపతిరావు, ఎస్.మోహనరావు, టి.అప్పన్న, కె.కృష్ణమాచారి, జి.రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 కార్యక్రమంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం కక్ష సాధించి ఉంటే
# వైసీపీ వారితో సెంట్రల్ జైలు నిండిపోయేది

- ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్దే ధ్యేయంగా పాలన సాగిస్తోంది : ఎమ్మెల్యే ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): గత వైకాపా ప్రభుత్వం మాదిరిగా తమ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగి ఉంటే గడచిన ఈ ఏడాదిలో రాజమండ్రి సెంట్రల్ జైల్ నిండిపోయి ఉండేదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. కానీ తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్దే ధ్యేయంగా పాలన సాగిస్తోంది పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో తన విజయానికి కష్టపడి పనిచేసి 73 వేలకు పైగా భారీ మెజారిటీతో గెలిపించిన కూటమి లోని టీడీపీ జనసేన బీజేపీ నాయకులు కార్యకర్తలు అందరూ నాయకులుగా ఎదగాలని, అందరికీ సముచిత స్థానం కల్పించాలన్న ఆలోచనతో నగరంలోని ఆయా దేవస్థానాల కమిటీల్లో వారికి చోటు కల్పించామని వెల్లడించారు. నగరంలో 14 ఎండోమెంట్ కమిటీలు ఉంటే వాటిలో నాలుగు కమిటీలకు ప్రభుత్వ ఆమోదం వచ్చిందని, మరో రెండుమూడు రోజుల్లో మరో నాలుగు కమిటీలకు ఆమోదం రానుందన్నారు. ఈ మేరకు తిలక్ రోడ్డు లోని తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కమిటీలు వేయడంవల్ల దేవాలయాలు మరింత అభివృద్ధి చెందుతాయని, కమిటీ ఉండడం వల్ల అన్ని విధాలుగా కూడా దాతలు ముందుకొస్తారని పేర్కొన్నారు. నాళం భీమరాజు వీధిలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా మద్ది నాగ పూర్ణ వెంకట సత్యనారాయణ, సారంగధరేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా కె.వి.డి.ఎస్.వి.చౌదరి, నేషనల్ సీనియర్ బేసిక్ స్కూలు కమిటీ చైర్మన్‌గా చింతా జోగి నాయుడు, కోరుకొండ రోడ్డు లోని శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా ఏడిద వీర వెంకట దుర్గా ప్రసాద్ నియమితులయ్యారని ఆయన చెప్పారు. ఈ నాలుగు దేవస్థానం కమిటీలు రెండు మూడు రోజుల్లో ప్రమాణ స్వీకారం చేస్తాయని ఆయన చెప్పారు. అలాగే శ్రీ ఉమా మార్కండేయ స్వామి దేవస్థానం చైర్మన్‌గా మదన్ సింగ్ రాజ్ పురోహిత్, శ్రీ శ్యామలాంబ దేవస్థానం చైర్మన్‌గా కడియాల వీరభద్రరావు, శ్రీ పందిరి మహాదేవుడు సత్రం చైర్మన్‌గా రెడ్డి మణేశ్వరరావు, జాంపేట శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా దాసరి గురునాధరావు నియమితులయ్యారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. త్వరలో ఈ కమిటీలు కూడా ప్రమాణ స్వీకారం చేస్తాయని ఆయన తెలిపారు. ఈ కమిటీలు భక్తుల నమ్మకం, విశ్వాసం పొందేలా పనిచేయాలని ఆయన సూచించారు. గత వైసీపీ పాలనలో మార్కండేయ స్వామి దేవస్థానంలో క్షమించరాని పాపాలు చేశారని ఆయన ఆరోపించారు. రెండేళ్ల కాలపరిమితితో ఈ కమిటీలు పని చేస్తాయని, మరో రెండేళ్ళకు మళ్ళీ కొత్తవారితో కమిటీలు వేస్తామని ప్రతి కమిటీలోను పదునుంచి పదకొండు మంది సభ్యులు ఉంటారని తద్వారా నాలుగేళ్లలో సుమారు 280 మందికి అవకాశం కల్పించినట్లవుతుందని ఆయన చెప్పారు. మద్యం స్కాంపై సిట్ తనపని తాను చేసుకు వెళుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు.

# దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి : బేబి నాయన



విజయనగరం (చైతన్యరథం): ప్రతిపక్షనాయకులు దుర్బుద్ధితో దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని టీడీపీ శ్రేణులు తిప్పికొట్టాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన పిలుపునిచ్చారు. బొబ్బిలి వ్యవసాయమార్కెట్ కమిటీని రాజకీయ పునరావాస కేంద్రంగా కాకుండా నియోజకవర్గ పరిధిలోని రైతులకు పక్కాగా ఉపయోగపడేలా మోడల్ ఏఎంసీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన తెర్లాం మండలానికి చెందిన టీడీపీ నేత నర్సుపల్లి వెంకటనాయుడు, పాలకవర్గ సభ్యులు మంగళవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టరు రవికిరణ్ ఆధ్వర్యంలో నూతన పాలక వర్గ సభ్యులుబాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తెర్లాం మండల టీడీపీ నాయకుడు మర్రాపు యుగంధర్ అధ్యక్షతన జరిగిన సభలో బేబీనాయన మాట్లాడారు. టీడీపీ నాయకుడు తెంటులక్ష్మునాయుడు మాట్లాడుతూ... రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. కాగా వైస్‌చైర్‌పర్సన్‌గా గొర్లె లీలారాణి, పాలకవర్గ సభ్యులుగా కోనారి రమేష్, మింది రమాదేవి, లంక రమేష్, గునుపూరు అప్పలనరసమ్మ, షేక్‌జిలాని, పొందూరురామారావు, యజ్జలక్ష్మి, రెడ్డి కృష్ణ కుమారి, సాకేటి గౌరి, టింగలి రాంబాబు, బి.శివకృష్ణ, మూడడ్ల కృష్ణమూర్తి, పసుమర్తి మణి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో బొబ్బిలి పీఏ సీఎస్‌అధ్యక్షుడు, వ్యవసాయశాఖ అసిస్టెంట్‌డైరెక్టరు, జగన్నాథపురం సర్పంచ్ బొద్దల లక్ష్మి, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి రవికిరణ్, మునిసిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టరు రౌతురామ్మూర్తి, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు గిరడ అప్పలస్వామి, మరిశర్ల రామారావునాయుడు, అల్లాడ భాస్కరరావు, పువ్వల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి...
## అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

కాకినాడ పోలీసు పరేడ్ మైదానంలో ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. ఆయన కలెక్టరేట్ హాలులో స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రభుత్వ పథకాల శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా శాఖల ప్రగతి నివేది కలను బుధవారంలోగా పంపించాలన్నారు. ఆయా శాఖల పరిధిలో అత్యుత్తమ సేవలు అందించిన వారి పేర్లను అవార్డులకు సిఫార్సు చేయాలన్నారు. అవార్డు లకు గౌరవం పెరిగేలా ఉత్తమ పనితీరు కనబర్చిన వారిని మాత్రమే గుర్తించి వారి పేర్లను ఈనెల 7వ తేదీలోపు పంపించాలన్నారు. పోలీసు పరేడ్ మైదా నంలో 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జరిగే వేడుకలకు ప్రజలు, స్వా తంత్ర్య సమరయోధుల కుటుంబీకులు, ఇతర ప్రముఖులు ఆహ్వానితులేనన్నా రు. వేదిక, సీట్లు, సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీ ఆధ్వ ర్యంలో ముందుగానే పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అందరికీ సరిపడేలా తాగునీరు సమకూర్చాలన్నారు. పోలీసు, ఎన్‌సీసీ విభాగాల వారు గార్డ్ ఆఫ్ హానర్, పరేడ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు. అతిథులు, సామాన్య ప్రజలు, విద్యార్థులు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది కల గకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు సరిచూసుకోవాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు భాగసాములవుతారని, ఈ మేరకు సిటింగ్ ఏర్పాట్లు చేయాలన్నా

# సూర్యఘర్ పథకంపై ప్రచారం కల్పించాలి



ఏలూరు (చైతన్యరథం): ప్రతి వినియోగదారుడు సూర్యఘర్ పథకంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ టి. సూర్యప్రకాశ్ ఆదేశించారు. ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా భీమవ రం వచ్చిన ఆయన ఎస్‌ఈ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో విద్యుత్. వినియోగదారులకు అంత రాయాలు లేని విద్యుత్ సరఫరా చేసేందుకు అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఏ సబ్ స్టేషన్లపరిధిలో అంతరా యాలు వస్తున్నాయో ప్రశ్నించారు. కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్తు సబ్‌స్టేషన్‌ల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకో వాలన్నారు. ఈ సందర్భంగా ఆయనను సిబ్బంది సత్కరించారు. ఈఈ ఎన్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును మర్యాద పూర్వకంగా కలిశారు.

**డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన విద్యుత్ శాఖ అధికారులు**

డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజును కాళ్ల మండలం పెద అమిరంలోని ఆయన కార్యాలయంలో ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ టీవీ సూర్యప్రకాశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ పరిధిలోని పలు సమస్యలపై చర్చించారు. ఆకివీడు మండలం పెదకాపవరంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని, ఉండి నియోజకవర్గంలో లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించి, నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం ఇవ్వడానికి చర్యలను తీసుకోవాలని కోరారు.

# ఉద్యాన పంటకు ప్రభుత్వం చేయూత



శ్రీకాకుళం (చైతన్యరథం): ఉద్యాన పంటలకు కూటమి ప్రభు త్వం చేయూతనిస్తుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. పెదలింగాలవలసలో ఆయిల్‌పామ్ విస్తరణ మహో త్సవంలో భాగంగా రైతులకు ఉచితంగా ఆయిల్‌పామ్ మొక్కలను పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పతంజలి ఏజీఎం పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో ప్రస్తుత ధరలతో ఎకరానికి రూ.లక్ష వరకు నికర ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, బీజేపీ మండల అధ్యక్షుడు లుకలాపు అప్పలనాయుడు, సర్పంచ్ లుకలాపు యశోద, డీడీహెచ్ లక్ష్మీనారాయణ, డీఎంవో ఆర్‌వీవీ ప్రసాద్, హెచ్‌వో అమరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పిన పాఠశాల బస్సు



ముదినేపల్లి (చైతన్యరథం): ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెద్దకామనపూడిలో ప్రైవేటు పాఠశాల బస్సు ప్రమాదానికి గురైంది. స్టీరింగ్ రాడ్ విరగడంతో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు వెంటనే స్పందించి బస్సు అద్దాలు పగలగొట్టి విద్యార్థులను బయటకు తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 27 మంది విద్యార్థులు ఉన్నారు. గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# విజయవాడ-గుంటూరు హైవేపై లారీ దగ్ధం

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎదురుగా విజయవాడ-గుంటూరు హైవేపై లారీ దగ్ధమైంది. రోడ్డుపై మార్జిన్ పెయింట్ వేసే లారీ హైవేపై నిలిపి ఉండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వాహనంలోని నాలుగు సిలిండర్లు పేలాయి. పేలుడు శబ్దం దాటికి సమీపంలోని ప్రజలు, వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం

**● నందిగామలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



నందిగామ (చైతన్యరథం): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, నెట్టెం రఘురాం ఇంటింటికీ కరపత్రాల పంపిణీ చేశారు. బుధవారం నాడు నందిగామ మండలంలోని సోమవారం గ్రామంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ మరియు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాంతో కలిసి ప్రభుత్వ విప్ మరియు నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో సమావేశమై, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మరియు సంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం యొక్క సుపరిపాలన లక్ష్యాలను ప్రజలకు చేరవేయడం, వారి నమ్మకాన్ని బలోపేతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండల కృష్ణకుమారి, గ్రామ సర్పంచులు, కూటమి నేతలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మంగళగిరిలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

**●38 కంపెనీల ప్రతినిధులు హాజరవ్వగా 508 మంది ఉద్యోగాలకు ఎంపిక**

**●ఎంపిక అయిన వారికి నియామక పత్రాలు అందజేసిన టీడీపీ నేతలు**



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి పట్టణంలో ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరుద్యోగులు హాజరవ్వగా ప్రతిభ, అవగాహన సామర్థ్యం ఆధారంగా 508 మందికి ఉద్యోగాలు లభించాయి. నిరుద్యోగ యువతి, యువకుల కోసం డాటా ఎంట్రీ, బి.పి.ఓ, రిటైల్, ఈ కామర్స్, ఆటోమోటివ్, వైద్య ఫార్మసీ, ఎలక్ట్రికల్, బ్యాంకింగ్, హీరో మోటర్స్, మాస్టర్ మైండ్స్, శ్రీరాం ఫైనాన్స్, ఇన్సూరెన్స్, మెడ్ ప్లస్, సాఫ్ట్ వేర్, ముత్తూట్ ఫైనాన్స్ రంగాలలో ఉద్యోగ అవకాశాల కల్పనకై మెగా జాబ్ మేళాను వీటిజేఎం అండ్ ఐవిటిఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన వారు, ఇంటర్, డిప్లమా, బి-ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, బీఈ, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. 38 పైగా కంపెనీల్లో ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటి ఆధారంగా కంపెనీల్లో రూ.15వేల మొదలుకొని రూ.40 వేల వరకూ జీతం లభించే ఉద్యోగాలకు 508 మందిని ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు నాయకుల చేతుల మీదుగా అందజేశారు. నియామక పత్రాలు పొందిన ఉద్యోగస్తులు మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి మాట్లాడుతూ ఎంపిక అయిన యువతీ, యువకులను అభినందించారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతినెల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో స్కిల్ డెవలప్మెంట్ ద్వారా జాబ్ మేళాలు నిర్వహించడం జరుగుతుందని దానిలో భాగంగా ఈరోజు మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగజేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న మంత్రి నారా లోకేష్ ఆశయానికి అనుగుణంగా యువత నడుచుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కే. సంజీవరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి డి. దుర్గాబాయి, సీడప్ జేడీయం రాంబాబు, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, మంగళగిరి మండల అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడంటే నాకు ఎనలేని మమకారం: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**●అందరం కలిసి మన గుడివాడను అభివృద్ధి చేసుకుందాం**



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ అంటే నాకు ఎనలేని మమకారమని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎంతవరకైనా వెళతానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ అభివృద్ధికి అందరం కలిసి పని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలు మరియు ప్రభుత్వ పథకాలు అమలుపై పురపాలక సంఘ ఉద్యోగులు మరియు సచివాలయ కార్యదర్శిలతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సత్యనారాయణపురంలోని ఐఎంఏ హాల్లో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు, పథకాల అమలులో తలెత్తుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే రాము అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఉద్యోగులు చెప్పిన సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ సింహాద్రి మనోహర్‌కు ఎమ్మెల్యే రాము సూచించారు.సమావేశంలో సచివాలయ కార్యదర్శులకు ఎమ్మెల్యే రాము పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయన ఉద్యోగుల ఉద్దేశించి మాట్లాడారు... ప్రజల సమస్యలను మరింత పారదర్శకంగా పరిష్కరించేందుకే ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. గుడివాడ నియోజకవర్గంలో ఉద్యోగుల ఇబ్బందులను నావిగా భావించి వాటిని పరిష్కరిస్తానన్నారు. సమస్యలు ఉంటే ఉద్యోగులు ఎప్పుడైనా నన్ను వచ్చి కలవవచ్చన్నారు. మనందరం కలిసి పనిచేస్తూ గుడివాడ అభివృద్ధిని సాధించుకుందామని ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు చేరువ కావడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. నాతో సహా అందరం జవాబుదారీతనంతో ప్రజల మంచి కోసం పనిచేయాలని,వ్యవస్థలు సరిగా పని చెయ్యకపోతే ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందన్నారు. శాఖల వ్యత్యాసం చూడకుండా ఉద్యోగులందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే రాము సూచించారు. అవగాహన లేమితో కొందరు పనిగట్టుకుని చేసే పనికిమాలిన విమర్శలను నేను స్పందించనని, ఉద్యోగులందరూ ఆత్మసంతృప్తితో పనిచేయాలని, నియోజకవర్గంలోని ఉద్యోగ వర్గాలకు నా సంపూర్ణ సహకారం ఉంటుందని సమావేశంలో ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ జనసేన ఇన్‌ఛార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్, ఎం.ఈ. ప్రసాద్, పురపాలక సంఘ ఉద్యోగులు, పట్టణ పరిధిలోని సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పేదల పెన్నిధి మంచికి మారు పేరు... మా ఎమ్మెల్యే నసీర్

**● టీడీపీ గుంటూరు జిల్లా యస్టీ సెల్ అధ్యక్షులు యం. శ్రీను నాయక్**




గుంటూరు (చైతన్యరథం) : ప్రజలు దాదాపు ఇరవై ఏళ్ళు నుండి కష్టాలు పడుతు బాధలు పడుతు ఉన్న క్రమంలో నా ప్రజలకు నేనున్నానని నా ప్రజనీకం కష్టాలు పడుతున్నరని దైర్యంగా నారా చంద్రబాబు దగ్గర మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకొని గత ఎన్నికలలో సైకో పాలనకు స్వస్తి పలికి ప్రజల మన్ననలు పొంది సుమారు ముప్పై వేల మెజారిటీతో గెలుపొంది తూర్పు నియోజకవర్గన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తున్న యువనేత జననేత నసీర్ అని టీడీపీ జిల్లా యస్టీ సెల్ అధ్యక్షుడు ఎం. శ్రీనునాయక్ వ్యాఖ్యానించారు. ప్రజా నాయకుడిపై లేనిపోని అబండాలు వేస్తూ పిచ్చి కుక్కల మాదిరిగా నసీర్ అన్నపై పేటియం చిల్లరగాళ్ళు నోరు పారెసుకుంటున్నారన్నారు. ఆయన చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక సైకో బ్యాచ్ సోషల్ మీడియాలో విషప్రచారాలు చేయడం సరికాదన్నారు. ఈ పేటీఎం బ్యాచ్ ఎన్ని పిచ్చి వేషాలు వేసిన ఎన్ని నిందలు వేసిన ఎన్ని కల్పితాలు సృష్టించిన ఎన్ని నేరాలు మోపిన తూర్పు నియోజకవర్గం ప్రజనీకం నమ్మదన్నారు. ఇప్పటికైనా బ్లూ మీడియా పేటీఎం బ్యాచ్ పిచ్చి పిచ్చి వ్యాఖ్యాలు చేయడం మానుకోవాలి. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా నసీర్ అన్నకు అభివృద్దే ముఖ్యమని శ్రీను నాయక్ అన్నారు. ఎమ్మెల్యే నసీర్‌కు ప్రజల అండదండలు మెండుగా ఉన్నాయని, తూర్పు నియోజకవర్గ ప్రజనీకం శ్రీరామరక్షని పూర్తి నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ సీనియర్ నాయకులు రత్నం తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజాంపట్నంలో ఒకే వీధిలో నాలుగు డెంగీ కేసులు...

బాపట్ల (చైతన్యరథం): నిజాంపట్నం మండలం ముత్తుపల్లి ఎస్సీ కాలనీలో ఒకే వీధిలో నాలుగు డెంగి కేసులు నమోదయ్యాయి. ముత్తుపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలో వైద్యాధికారులు సేకరించిన 13 వైద్య పరీక్షలలో మెరుగుపాల నాంచారయ్య (73), మెరుగుపాల నాగమల్లేశ్వరి (34), మెరుగుపాల సునీత (45), కొక్కిలిగడ్డ శివయ్య (34) డెంగీ కేసులను గుర్తించినట్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎం. ఎల్ హెచ్.పి మేడిగ విజయ్ దీపక్ తెలిపారు. నాంచారయ్య కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా, మిగిలిన ముగ్గురు నగరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో డోర్ టు డోర్ ఫీవర్ సర్వే జరుపుతున్నట్లు, కేసులను గుర్తించిన వెంటనే తక్షణ వైద్యం అందే విధంగా ఏర్పాటు చేసినట్లు ఎం.ఎల్ హెచ్.పి మేడిగ విజయ్ దీపక్ తెలిపారు. నిత్యం కరెంట్ కోతల కారణంగా దోమల బెడద తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ముత్తుపల్లి-ఈదుపల్లి గ్రామ పంచాయితీల మధ్య పారుతున్న రేపల్లె ప్రధాన మురుగు కాల్వ పరిసరాలలో డెంగీ కేసులు నమోదు కావడం పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నది.

# విద్యార్థులకు గుడ్ న్యూస్... వారికి వరుసగా సెలవులు

విద్యార్థులకు గుడ్ న్యూస్. వారికి వరుసగా సెలవులు వచ్చాయి. దీంతో మూడు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పాఠశాలలు మూతపడనున్నాయి. ఆగస్ట్ 8వ తేదీ శ్రావణ శుక్రవారం, ఆగస్ట్ 9వ తేదీ రాఖీ పౌర్ణమి. అదీకాక ఆ రోజు రెండో శనివారం కూడా. ఇక ఆగస్ట్ 10 వ తేదీ ఆదివారం. దీంతో బడులు, కాలేజీలకు వరుసగా మూడు రోజులు సెలవులు ఇచ్చారు. అయితే వరుసగా స్కూళ్లకు సెలవులు రావడంతో.. పిల్లలతో వారి తల్లిదండ్రులు లాంగ్ టూర్ వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. వరుసగా సెలవులు రావడంతో.. దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు సంబంధించిన రిజర్వేషన్ల లిస్ట్ భారీగా పెరిగింది. మరోవైపు ఆగస్ట్ 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవం. ఆ రోజు సైతం సెలవు దినమే. ఆగస్ట్ 16వ తేదీ శ్రీకృష్ణాష్టమి దీంతో శనివారం సెలవు వచ్చింది. ఇక ఆగస్ 17వ తేదీ ఆదివారం. దీంతో ఈ వారంతోపాటు వచ్చే వారంలో సైతం శుక్ర, శని, ఆదివారాలు వరుసగా సెలవులు వచ్చాయి. ఆ రోజుల్లో సైతం తమ పిల్లలతో టూర్లు వెళ్లేందుకు తల్లిదండ్రులు సమాయత్తమవుతున్నారు.



# అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం

**పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి**

వి కోట, చైతన్యరథం): రైతులకు తోడుగా కూటం ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని, రైతుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇస్తున్నదని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి తెలిపారు. వీ.కోట మండల పరిధిలోని సింగల్ విండో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి హాజరయ్యారు. మొదట వి.కోట ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్ గా నియామకమైన నారాయణస్వామి చేత స్వయంగా ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు, డైరెక్టర్లుగా జయప్ప, మూర్తి లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ముదరం దొడ్డి సింగల్ విండో చైర్మన్ గా హరినాథ్ రెడ్డి డైరెక్టర్లుగా రాధాకృష్ణ, చిన్నబ్బ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యవర్గం సభ్యులచే ప్రమాణం చేయించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.జిల్లాలో సెంట్రల్ బ్యాంకుకు



చాలా ఘనమైన చరిత్ర ఉందన్నారు.రైతులకు సకాలంలో తక్కువ వడ్డీకి రుణాలందించి సింగిల్ విండో కార్యవర్గం వారికి అండగా నిలిచి వారి అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.రైతుల సహకారం తో నడిచే బ్యాంకులను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకుల స్వయం సంవృద్ధికి రైతులు తోడ్పాటు అందించి సక్రమంగా రుణలు తిరిగి చెల్లించాలని సూచించారు.ప్రభుత్వ పరంగా చంద్రబాబు బాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఇటీవల రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదు జమ చేయడం జరిగిందన్నారు.ముఖ్య మంత్రి ఎన్నికలకు ముందు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు ఆగస్టు 15 నాటికి సూపర్ హిట్ కాబోతున్నాయన్నారు.గత ఐదేళ్లలో అప్పటి వైస్సార్సీపీ ప్రభుత్వం జగన్ రెడ్డి నాయకత్వం లో రాష్ట్రం మొత్తం దివాలా తీసిందన్నారు.ఈ రోజు వారు చేసిన తప్పిదాలు ఒక్కొక్కటి వెలుగులోనికి వస్తూ ఒక్క మద్యం పైన ఎంత దోచుకున్నారో సామాన్య ప్రజలకు కూడా అర్థం అవుతోందన్నారు.మా రాష్ట్రము లో మద్యం అమ్మకాలు పడిపోయాయని, ఆంధ్రలో నాణ్యమైన మద్యం దొరుకుతొందని రాష్ట్ర సరిహద్దులోని కర్ణాటక వారే నేడు చెప్పే పరిస్థితి ఏర్పడిందన్నారు.గతంలో జరిగిన అవినీతి అక్రమాలను ఆదిగమించు కొంటూ రాష్ట్రానికి సంబంధించి పోలవరం, అమరావతి లాంటి కార్యక్రమాలను గతంలోపాటు ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను అన్ని ఈ ప్రభుత్వం పారదర్శకంగ పూర్తి చేసేందుకు ముందుకెళ్తోందన్నారు. కార్యక్రమాల్లో మండల నాయకులు రంగనాధ్, రాంబాబు, చౌడప్ప, ఓబుల్ రెడ్డి, ఈశ్వర్ గౌడ్, సోమశేఖర్, ధీరజ్, విశ్వనాధ్, మురుగేష్, శభరీష్, సతీష్, అమర్ తదితరులు ఉన్నారు..



# ముత్తుకూరులో అన్న క్యాంటీన్

**సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి శంకుస్థాపన**

ముత్తుకూరు, (చైతన్యరథం): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ముత్తుకూరులో రూ.65 లక్షలతో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ క్యాంటీన్‌లో పేదలకు కేవలం రూ.5కే టిఫిన్, భోజనం అందించనున్నారు. గత టీడీపీ హయాంలో ముత్తుకూరు, పొదలకూరులో నడిచిన క్యాంటీన్లు వైసీపీ అధికారంలోకి రాగానే మూసివేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ వీటిని పునఃప్రారంభించారని చెప్పారు.



ట్రాఫిక్ ఐలాండ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

# పీ4తో గిరిజన కాలనీలకు కొత్త రూపు

**సీఎస్ఆర్ నిధులన్నీ కాలుష్యాన్ని భరిస్తున్న సర్వేపల్లి ప్రజలకే ఖర్చు చేయాలి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**

సర్వేపల్లె, (చైతన్యరథం): సీఎం చంద్రబాబు నాయుడు చేపట్టిన పీ4 కార్యక్రమానికి సర్వేపల్లి నియోజకవర్గంలో విశేష స్పందన లభిస్తోంది. ముత్తుకూరు పంచాయతీ అభివృద్ధి బాధ్యత చేపట్టిన అదానీ కష్ణపట్నం పోర్టు రూ.7.15 కోట్లతో పనులు చేయనుంది. రూ.2.50 కోట్లతో శ్మశానం అబివృద్ధి, రూ.2.65 కోట్లతో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచనున్నారు. రూ.2 కోట్లతో 435 ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. జిల్లా పరిషత్



హైస్కూలును రూ.7 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దేందుకు బీపీసీఎల్ కంపెనీకి ప్రతిపాదన పెట్టాం పొదలకూరులో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ ఆ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. డయాలసిస్ సెంటర్ లో ప్రభుత్వం 5 బెడ్లు ఏర్పాటు చేస్తే మరో 3 బెడ్లను కంపెనీ ఏర్పాటు చేసింది

నియోజకవర్గ వ్యాప్తంగా 40 మినరల్ వాటర్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేస్తోంది.గిరిజన కాలనీలను కంపెనీలు దత్తత తీసుకునేలా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.ఏ కంపెనీ అయినా తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సర్వేపల్లి నియోజకవర్గంలోనే సీఎస్ఆర్ నిధులు ఖర్చుపెట్టాలని స్పష్టం చేయాలన్నారు.వైసీపీ పాలనలో పేదల ఇళ్లను అగమ్యగోచరంగా మార్చారు..ధనార్జనే ధ్యేయంగా ఆ ఇళ్లను ఎటూ కాకుండా చేశారు.ప్రజలు రెండు సార్లు ఓట్లు వేసి గెలిపిస్తే వారి బతుకుల్ని కుప్పకూల్చేశాడన్నారు.ఏనాడూ సీఎస్ఆర్ నిధుల కోసం ప్రయత్నం చేసిన పాపాన పోలేదన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని భూముల రికార్డుల మార్చేయడం, సహజ వనరులను దోచేయడమే పనిగా పెట్టుకున్నారు అదృష్టవశాత్తు సర్వేపల్లి నియోజకవర్గంలో మంచి అధికారుల టీం అందుబాటులో ఉంది.. ప్రజలకు మంచి పాలన అందిస్తున్నాం.

# డ్రైనేజ్ సమస్యల పరిష్కారం

**చొరవ చూపిన డాక్టర్ గణేష్ కుమార్**

నెల్లూరు సిటీ, (చైతన్యరథం): మంత్రి పొంగూరు నారాయణ, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు ఆదేశాలతో డివిజన్ ఇంచార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షులు కలవకుంట భాస్కర్ , బూత్ ఇంచార్జీ లు కంచి కృష్ణ, నీలకంఠం మునికృష్ణ పర్యవేక్షణలో పూడికతీత పనులు జరిగాయి. చిన్న బజార్, ఆంధ్ర బ్యాంక్ సందు, ఆలా మసీద్ సందు, గర్ని వీధి ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించారు. ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. డివిజన్ ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సుకు తొలి ప్రాధాన్యతమస్తున్నామన్నారు.



# అభివృద్ధి దిశలో దర్శి నియోజకవర్గం అడుగులు

**సీఎం చంద్రబాబు హామీల అమలకు కార్యాచరణ**

**కలెక్టర్ తమీమ్ అన్సారియాతో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భేటీ**

దర్శి, (చైతన్యరథం): పియతమ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గారు దర్శి పర్యటన సందర్భంగా దర్శి ప్రాంత అభివృద్ధి కి ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ సిద్ధం చేసేందుకు దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పార్టీ లక్ష్మి కలెక్టర్ తమీమ్ అన్సారియాతో భేటీ అయ్యారు. ఒంగోలులోని కలెక్టర్ బంగ్లాలో బుధవారం కలుసుకున్నారు. దర్శిలో సీఎం పర్యటన విజయవంతం చేసినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గంలోని సీఎం చంద్రబాబుకు ఇచ్చిన అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. దర్శి పట్టణం, దొనకొండ, కురిచేడు మండలాల కు తాగునీరు అందించే నెదర్లాండ్ స్కీం ఫిల్టర్ బెడ్లు తక్షణమే మరమ్మతులు చేసి తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను డాక్టర్ లక్ష్మి కోరారు. మొత్తం తొమ్మిది ఫిల్టర్ బెడ్లలో కేవలం రెండు మాత్రమే పని చేస్తున్నాయని మిగిలిన ఏడింటికీ మరమ్మతులు అవసరమని అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని డాక్టర్ లక్ష్మీ కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం ఇచ్చిన హామీల అమలులో భాగంగా 17 కోట్ల నిధులతో చేపట్టనున్న డిగ్రీ కళాశాల పక్కా భవనాల నిర్మాణానికి కూడా అంచనాల రూపొందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలిస్తారని వివరించారు. ఐదు కోట్లతో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం, ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణం, డ్రైన్ల నిర్మాణం, దర్శి హైస్కూల్ ఫ్లోరింగ్ మరమ్మత్తుల పనులను చేపట్టాలని కలెక్టర్‌ను డాక్టర్ లక్ష్మీ కోరారు. అదేవిధంగా సీఎం చంద్రబాబు విచ్చేసిన తూర్పు వీరాయపాలెంలోని అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చకచకా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. రెండున్నర కిలోమీటర్లు రోడ్లు, 7 కిలోమీటర్ల డ్రైన్లు, 90 మందికి ఇళ్ల పట్టాలు, తూర్పు వీరాయపాలెం నుండి సామంతపూడి వైపు వెళ్లే రోడ్డు నిర్మాణం, కల్వర్టు నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలను తక్షణమే ప్రారంభిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వివరించారు. అదేవిధంగా దొనకొండ మండలంలోని ఆరవెల్లిపాడు గ్రామంలో 130 మందికి తల్లికి వందనం నిధులు సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోవడంతో తక్షణమే ఆ సమస్య పరిష్కారానికి కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించారు. నియోజకవర్గంలో అంగన్వాడీ భవనాలు అసంపూర్తిగా ఉన్న పనులు, త్వరలో ప్రారంభించనున్న ఇంటర్ నేషనల్ డ్రైవింగ్ స్కూలుపై సుదీర్ఘంగా చర్చించి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడకి దర్శిలో అభివృద్ధికి సహకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియాకు డాక్టర్ లక్ష్మీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నియోజకవర్గ టీడీపీ నేతలు నవ్వులూరి విద్యాసాగర్, బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి, నాగులపాటి శివకోటేశ్వర రావు ఉన్నారు.



# చౌరవకు చిరునామా ఎమ్మెల్యే పరిటాల

**పండమేరు పాత బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభం, 85 లక్షలతో మరమ్మతు పనులు ఎమ్మెల్యే సునీత చొరవతో 3 నెలల్లో పూర్తి**


అనంతపురం, (చైతన్యరథం): ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రజాసమస్యల పరిష్కారానికి అధినేత చంద్రబాబు అడుగు జాడల్లో నడుస్తున్నారు. నగరంలోని టీవీ టవర్ సమీపంలో, ఆర్డీటీ క్రికెట్ స్టేడియం దగ్గర ఉన్న పండమేరు పాత బ్రిడ్జిపై నేటి నుంచి రాకపోకలు పునః ప్రారంభం కానున్నాయి. గత ఏడాది అక్టోబర్ మాసంలో భారీ వర్షాలు కురవడం వల్ల.. వంకలో భారీగా నీరు ప్రవహించింది. బ్రిడ్జిని తాకుతూ నీరు రావడంతో బేరింగులు దెబ్బతిన్నాయి. అప్పట్లో ఎమ్మెల్యే పరిటాల సునీత ఈ బ్రిడ్జిని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. బ్రిడ్జ్ బేరింగ్ లు దెబ్బ తినడం వల్ల రాకపోకలు కొనసాగించడం ప్రమాదకరమని హెచ్చరించారు. దీంతో పక్కనే ఉన్న కొత్త బ్రిడ్జిపై వన్ వే లో రాకపోకులకు అంతరాయం లేకుండా చూడాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు. పాత వంతెన మరమ్మతుల కోసం కోటి రూపాయలు అంచనాతో ప్రతిపాదనలను కేంద్ర రవాణా, రహదారుల శాఖ వారికి అధికారులు పంపారు. కేంద్ర ప్రభుత్వంతో ఎమ్మెల్యే సునీత మాట్లాడి ఈ ఏడాది మార్చి 27న ఆమోదించేలా చేశారు. టెండర్ల ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఏప్రిల్ 29న ముంబైకి చెందిన టెక్ ఫాస్ట్ రీబిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి పనులు అప్పజెప్పారు. 85 లక్షల వ్యయంతో ఆరు నెలల కాలపరిమితిలోగా పాత వంతెన పనులను పునరుద్ధరించాలన్నారు. ఎన్.హెచ్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో కేవలం మూడు నెలల కాల పరిమితిలోనే పూర్తి చేసేలా ఎమ్మెల్యే పరిటాల సునీత పర్యవేక్షించారు. స్వయంగా బ్రిడ్జిని సందర్శించి అధికారులపై ఒత్తిడి చేశారు. దాదాపు 8 నెలలుగా వన్ వే మార్గంలో బ్రిడ్జి మీద రాకపోకలు సాగుతున్నాయి. దీనివల్ల పలుసార్లు ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడింది. ఎమ్మెల్యే పరిటాల సునీత కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఇటీవల ఇదే మార్గంలో పైప్ లైన్ మరమ్మతులు కారణంగా రెండు రోజులు వాహనాల రాకపోకలు ఆగాయి. ఆ సమయంలో కూడా అధికారులతో మాట్లాడి బ్రిడ్జిని మరోసారి ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి రాకపోకలు ప్రారంభించే విధంగా చూడాలన్నారు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి పాత బ్రిడ్జిపై రాకపోకలు పునః ప్రారంభం కానున్నాయి. ఇన్ని రోజులు ప్రయాణికులకు వాహనదారులకు ఇబ్బంది కలిగిందని.. అయితే బ్రిడ్జి భద్రత దృష్ట్యానే రాకపోకలు ఆపినట్లు ఎమ్మెల్యే సునీత తెలిపారు. ఇక నుంచి యధావిధిగా కొనసాగుతాయని ఆమె ప్రజలకు తెలిపారు.



# తాడిమర్రిలో వైసీపీకి షాక్

**వైసీపీ నుంచి టీడీపీలోకి 40కుటుంబాలు చేరిక, సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని వచ్చామన్న నేతలు, పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో పని చేస్తామని వెల్లడి**

ధర్మవరం, (చైతన్యరథం): నియోజకవర్గంలోని తాడిమర్రిలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీలో కీలకంగా ఉన్న పలువురు నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. తాడిమర్రి టీడీపీ నాయకులు హర్ష, గణేష్ ఆధ్వర్యంలో పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ సక్షమంలో పార్టీలోకి వచ్చారు. తాడిమర్రికి చెందిన బండారు నరేంద్ర, పన్నూరు నాగభూషణ, హరిజన నరసింహడు, తలారి నారాయణస్వామితో పాటు మొత్తం 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. అనంతపురం క్యాంపు కార్యాలయంలో శ్రీరామ్ వీరికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తున్న తీరు చూసి, ఆయనతోనే తమ ప్రాంతానికి మంచి జరుగుతున్న నమ్మకంతో పార్టీలోకి వచ్చినట్లు నాయకులు తెలిపారు. వైసీపీలో గత కొన్నేళ్లుగా పని చేస్తున్నప్పటికీ ఎలాంటి గుర్తింపు లేకపోగా.. తమ ప్రాంతానికి ఎలాంటి మంచి జరగలేదన్నారు. పరిటాల శ్రీరామ్ అప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా ఇప్పుడు అధికారంలో ఉన్నా ప్రజల కోసమే పని చేస్తున్నారన్నారు. తాడిమర్రి ప్రాంతంలో ప్రజలకు ఏ సమస్య ఉన్నా శ్రీరామ్ వెంటనే స్పందిస్తున్నారన్నారు. ఇటీవల ఆయన మీ సమస్య-మా బాధ్యత పేరుతో చేపట్టిన కార్యక్రమాలు కూడా మమ్మల్ని మరింత ఆకర్షించాయన్నారు. అందుకే తెలుగుదేశం పార్టీలో చేరామని, ఇక నుంచి శ్రీరామ్ నాయకత్వంలో పని చేస్తామని తెలిపారు. మరోవైపు శ్రీరామ్ మాట్లాడుతూ వైసీపీలో చాలా మంది నాయకులు ఇబ్బందులు పడ్డారని, గతంలో పార్టీ అధికారంలో ఉన్నా కూడా వారు బాధితులుగానే మారారన్నారు. ఆ పార్టీలో ఇబ్బంది ఎవరికైనా సరే తాము అండగా ఉంటామని శ్రీరామ్ తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.



# బీటీ ప్రాజెక్టుకు నీళ్ళు రావాలి

అనంతపురం, (చైతన్యరథం): ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆశయం బీటీపీ ప్రాజెక్టుకు నీళ్లు తీసుకొచ్చి చెరువులు నీరు అందిచే లక్ష్యం నెరవేరాలని ఆయన అనుచరులు దేవుడిని వేడుకున్నారు. కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు



**ఘనంగా ఎమ్మెల్యే అమిలినేని జన్మదిన వేడుకలు**

**ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ**

జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం బేరీల నాగరాజు మిత్రబృందం ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించినారు. వారు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారూ. ఈ సందర్భంగా వారి మిత్ర బృందంతో కలిసి ఈ విధంగా బ్రెడ్లు పండ్లు పంపిణీ చేయడం సంతోషకరమనివారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే అయిన నాటి నుండి ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి బేరిలా నాగరాజు తెలియజేశారు. ముఖ్యంగా పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ నిరుద్యోగులకు డ్రోన్ ట్రైనింగ్ తర్వాత మహిళలకు కుట్టు మిషన్లు ట్రైనింగు యువతీ యువతులకు బ్యూటిషన్ పార్లర్ ట్రైనింగ్ తరువాత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసి వారికి కోచింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు



# చంద్రబాబుపై నోరెత్తితే తాటతీస్తాం

**నియోజకవర్గ ఇంచార్జి బీటెక్ రవి**

కడప, చైతన్యరథం): సొంత మీడియాతో అబద్ధం నిజం చేయాలని వైకాపా చూస్తోంది అని మా ఏజెంట్ ను ప్రలోభ పెట్టినందుకే ఘర్షణ జరిగింది అని నియోజక వర్గ ఇంచార్జి మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రచారం చేసుకోవడం కోసం వైసీపీకి కనంపల్లె, ఈ కోత్తపల్లె గ్రామాలలోనూ మాకు నల్లగొండువారి పల్లె లో అనుమతి ఇచ్చారు అని కానీవేల్పుల రాము మరి కొందరు కలిసి మా పార్టీ ఏజెంట్ల దగ్గరికి వచ్చి ప్రలోభాలు పెట్టి ఒత్తిడి చేశారనీ అలా చేయద్దు అని వారించారని దీనితో రామలింగారెడ్డి వర్గీయులు మా కార్యకర్త పై కులం పేరుతో దూషిస్తూ దాడీ చేయడంతో మా కార్యకర్తలు రామలింగా రెడ్డి వారియులపై ప్రతి దాడి చేశారన్నారు.వాళ్ళు అడిగిన గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగలేదన్నారు.నిన్న జరిగిన గొడవలు లేని వ్యక్తుల పేర్లు పెట్టారు అని అన్నారు. వైకాపా వారు పోలీసులతో అరెస్ట్ చేయిస్తున్నారు అని పదేపదే చెబుతున్నారనిపోలీసులు మాకు అవసరం లేదు అని పోలీసులు లేకుండా రండి తేల్చుకుందాం అని సవాల్ విసిరారు.మేము ఏ గ్రామానికి వెళ్ళినా పార్టీలో చేరుతున్నారు దానిని ఓర్వలేక మా పై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు అని ఆయన అన్నారు.



# త్వరితగతిన వైవీయూ స్నాతకోత్సవం

**కడప జిల్లా టీఎన్ఎస్ ఎఫ్ అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్**

చింతకొమ్మదిన్నె, (చైతన్యరథం): పబ్లిక్ టుడే, యోగి వేమన యూనివర్సిటీలో స్నాత కోత్సవం త్వరగా నిర్వహించాలని టీఎన్ఎస్ఎఫ్ నేతలు కోరారు. మీడియా సమావేశంలో కడప జిల్లా టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్.డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థుల పట్టా కోసం యోగివేమన యూనివర్సిటీ కాన్వకేషన్ త్వరగా నిర్వహించాలని కోరుతూ బుధవారం నాడు వైవీయూ రిజిస్ట్రార్ పి పద్మకు టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా కాన్వొకేషన్ నిర్వహించకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన కాన్వొకేషన్ నిర్వహించాలని కోరారు. ఇప్పటికే దాదాపు 13వేల మంది విద్యార్థులు కాన్వకేషన్ కోసం ఆన్లైన్ దరఖాస్తు చేసుకున్నారని పై చదువులకు మరియు ఉద్యోగాలకు వెళ్లే వారికి ఒరిజినల్ డిగ్రీ పట్టా అవసరం ఎంతైనా ఉందన్నారు. వీలైనంత త్వరగా కాన్వకేషన్ నిర్వహించి విద్యార్థులకు తోడ్పాటుగా ఉండాలని కోరారు. టి ఎన్ ఎఫ్ ఎస్ జిల్లా కార్యదర్శి అక్షయ్ కుమార్ రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ వైవీయూ అధ్యక్షుడు భరత్ సింహా, గంగన్న, రంజిత్, అబ్దుల్, కళ్యాణ్ పాల్గొన్నారు.



**పులివెందుల మండల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా కమలాపురం నియోజకవర్గం శాసనసభ్యుడు పుత్త చైతన్యరెడ్డి గారితో కలిసి పులివెందుల మండలం చంద్రగిరి గ్రామంలో ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శ్రీ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.**

# ఉత్తరాఖండ్ వరద బీభత్సంలో
# 28 మంది ఆచూకీ గల్లంతు



## కేరళ పర్యాటకులుగా గుర్తింపు

ఉత్తరాఖండ్లో మెరుపు వరదలు, క్లౌడ్ బరస్ట్ వేళ 28 మంది పర్యాటకుల బృందం ఆచూకీ గల్లంతైంది. వీరందరూ కేరళకు చెందినవారిగా తేలింది. వీరిలో 20 మంది మహారాష్ట్రలో స్థిరపడిన వారు కాగా.. మిగిలిన 8 మంది కేరళలోని వివిధ జిల్లాలకు చెందినవారిగా గుర్తించారు. ఈ బృందంలోని ఓ జంట బంధువు మీడియాతో మాట్లాడుతూ వారితో మాట్లాడి ఒక రోజు గడిచిందన్నారు. తాము మాట్లాడినప్పుడు "ఉత్తరకాశీ నుంచి ఉదయం 8.30కు గంగోత్రికి బయల్దేరినట్లు వెల్లడించారు. వారి మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ తర్వాత నుంచి వారితో ఎటువంటి కాంటాక్టు లేదు. ఫోన్లలో బ్యాటరీ అయిపోయిందా.. లేక వారున్నచోట సిగ్నల్ లేదా అనేది అర్థం కావడంలేదు" అని పేర్కొన్నారు. హరిద్వార్కు చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ 10 రోజులపాటు ఉత్తరాఖండ్ ట్రిప్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గంగోత్రికి వెళ్లే మార్గంలో ధరాలీ కీలకమైన స్టాప్. నిన్న భారీగా మెరుపు వరద విరుచుకుపడింది. క్షణాల్లో భవనాలు మట్టి కింద కూరుకుపోయాయి. ఇప్పటికే ఐదుగురు మృతి చెందినట్లు ప్రకటించారు. డజన్ల మంది ఆచూకీ గల్లంతైంది.

# కర్తవ్యభవన్ ప్రాజెక్టు ప్రారంభం

**- శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ**




దేశ రాజధాని ఢిల్లీలో ఉమ్మడి కేంద్ర సచివాలయ(సీసీఎస్) ప్రాజెక్టు కింద నిర్మించిన మొదటి భవనమైన 'కర్తవ్య భవన్'ను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం పది కార్యాలయ భవనాలు నిర్మించనున్నట్లు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ తెలిపింది. సీసీఎస్-3గా పరిగణిస్తున్న కర్తవ్య భవన్లోకి కేంద్ర హోం, విదేశీ వ్యవహారాలు, పెట్రోలియం శాఖ, ప్రధాన మంత్రికి ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయాలు తరలించనున్నట్లు పేర్కొంది.

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సీసీఎస్-2 సీసీఎస్-3 భవనాలు వచ్చే నెలకి పూర్తవుతుండగా సీసీఎస్-10వ భవనం వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి, 6వ, 7వ భవనాలు వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. 2019లో ప్రారంభించిన సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో సిద్ధమైన మొదటి భవనమిదే కావడం గమనార్హం. 1950-1970 మధ్య నిర్మించిన శాస్త్రి భవన్, కృషి భవన్, నిర్మాణ్ భవన్, ఉద్యోగ్ భవన్లలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు సీసీఎస్ ప్రాజెక్టు కింద నిర్మితమయ్యే కొత్త భవనాల్లోకి క్రమంగా మారనున్నాయి. నిర్మాణం పూర్తయ్యే వరకు నాలుగు భవనాలు నుంచి పనిచేస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు రెండేళ్లపాటు కస్తూర్బా గాంధీ మార్గ్, మింటో రోడ్, నేతాజీ ప్యాలెస్లోని నాలుగు నూతన భవనాల్లోకి తాత్కాలికంగా తరలివెళ్లనున్నట్లు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మంగళవారం తెలిపారు. కొత్త 'భవనాలలో నేషనల్ మ్యూజియం, నేషనల్ ఆర్కైవ్స్, జవహర్లాల్ నెహ్రూ భవన్ (విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ), డాక్టర్ అంబేద్కర్ ఆడిటోరియం ఉన్నాయి. సెంట్రల్ విస్టా పునరాభివృద్ధి ప్రణాళిక కింద కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కొత్త పార్లమెంట్ భవనం, వైస్ ప్రెసిడెంట్ ఎన్క్లేవ్ను నిర్మించింది. విజయ్ చౌక్ నుంచి ఇండియా గేట్ వరకు విస్తరించి ఉన్న కర్తవ్య మార్గాన్ని తిరిగి అభివృద్ధి చేసింది. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్తోపాటు ప్రభుత్వం ఒక ఎగ్జిక్యూటివ్ ఎన్ క్లేవ్ను కూడా నిర్మిస్తుంది. దీనిలో ప్రధాన మంత్రి నూతన కార్యాలయం, క్యాబినెట్ సెక్రటేరియట్, ఇండియా హౌస్, జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్ ఉన్నాయి. ఎగ్జిక్యూటివ్ ఎన్క్లేవ్ రెండో దశలో ప్రధానమంత్రి కొత్త నివాసాన్ని సైతం నిర్మించనున్నారు.

## ప్రపంచానికి హిందూయిజం చాలా అవసరం

**- ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్**

ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పలు యుద్ధాల గురించి ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం సంఘర్షణలతో నిండిన ప్రపంచానికి హిందూయిజం అవసరం చాలా ఉందని అభిప్రాయపడ్డారు. అన్ని రకాల వైవిధ్యాలను ఎలా అంగీకరించాలి? ఎలా పాటించాలనే విషయాన్ని హిందూయిజం మాత్రమే ప్రపంచ దేశాలకు నేర్పుతుందన్నారు. సంఘర్షణలను ఎలా నియంత్రించాలో ప్రపంచ దేశాలకు తెలియకపోవడం వల్లే రోజురోజుకూ ఘర్షణలు తీవ్ర రూపం దాలుస్తున్నాయని భాగవత్ అన్నారు. ధర్మాన్ని బోధించే హిందూయిజాన్ని పాటించడం మాత్రమే అన్ని సమస్యలకు పరిష్కారమని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటించగలిగే జీవన విధానాన్ని హిందూ సంస్కృతీ సంప్రదాయాలు అలవాటు చేస్తాయని భాగవత్ తెలిపారు. హిందూయిజం అనేది ఒక మతం కాదని.. ఓ సార్వత్రిక విశ్వాసం, మానవత్వం, ప్రకృతితో మమేకమైన జీవన విధానమని అన్నారు. ఈ మతం ప్రజలు దేవుడికి ఎలా సేవచేస్తారో, సమాజానికీ అదే విధంగా సేవ చేయాలని బోధిస్తుందని తెలిపారు. భారత ప్రజలు నమ్మే ధర్మం కోసం పూర్వీకులు అనేక త్యాగాలు చేసినట్లు దేశ చరిత్ర ప్రపంచానికి తెలియజేస్తోందని.. ప్రాణాలు పోతున్నా శివాజీలాంటి మహాత్ములు ధర్మాన్ని తప్పలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

## ఏఐతో ఉద్యోగాలకు ముప్పు లేదు

**ఆర్పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా స్పష్టీకరణ**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో ఉద్యోగాలు పోతాయని కొందరు నిపుణులు అంటుండగా మరికొందరు మాత్రం ఉద్యోగాలకు ఎలాంటి ముప్పు ఉండదని విశ్లేషిస్తున్నారు. అయితే మెజారిటీ ఉద్యోగుల్లో మాత్రం ఏఐపై భయాందోళనలు ఉన్నాయి. ఇవి ఉద్యోగుల స్థానాన్ని భర్తీ చేయగలవనే అభిప్రాయాన్ని ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్చల్లో తాజాగా ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా చేరారు. ఏఐ రాకతో ఉద్యోగాలు పోతాయా? అనే ప్రశ్నకు వివరణ ఇస్తూ ఎక్స్లో ఆసక్తికర పోస్టు పెట్టారు.

అందులో భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఉద్యోగాలను కోల్పోవడం గురించే అందరూ ఆందోళన చెందుతున్నారని గోయెంకా అన్నారు. అయితే ఏఐ ప్రస్తుతం జరుగుతున్న పనిని మార్చేసి అందులో నూతనత్వం తీసుకొస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రాంప్ట్ ఇంజినీర్లు, ఏఐ ప్రొడక్ట్ మేనేజర్లు, ఏఐ విలువల నిపుణులు వంటి కొత్త ఉద్యోగాలు పుట్టే అవకాశం ఉందన్నారు. కార్యాలయాలు కూడా నేటిలా కాకుండా వాటి రూపురేఖలు మారే అవకాశం ఉందన్నారు. స్మార్ట్ వర్క్ చేసేవారు వీటిలో బాగా రాణిస్తారనే అభిప్రాయం వ్యక్తంచేశారు. గోయెంకా పోస్టు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు.

గోయెంకా చెప్పినట్లుగా ఏఐ ఉద్యోగాల తొలగింపునకు కాకుండా.. నూతన ఉద్యోగ మార్కెట్కు తెర తీస్తోందని ఓ నెటిజన్ పేర్కొన్నారు. 'కాప్ జెమిని' వంటి కంపెనీలు ఫ్రెషర్లను నియమించుకుంటున్నాయన్నారు. మరో నెటిజన్ స్పందిస్తూ... ఏఐ ప్రతి రంగంలో ఉత్పాదకతను పెంచుతుందని పెట్టుబడిపై రాబడిని మెరుగుపరుస్తుందని అన్నారు. దీనివల్ల ఆర్థికవృద్ధి సైతం పెరుగుతుందని పేర్కొన్నారు. కంటెంట్ క్రియేషన్, కోడింగ్, డిజైనింగ్ రంగాల్లో ఏఐ ప్రభావం వల్ల ఉద్యోగాలపై కొంతమేర ప్రభావం పడుతుందని మరో నెటిజన్ అభిప్రాయం వ్యక్తంచేశారు.

## ప్రధాని చైనా పర్యటన ఖరారు

**గల్వాన్ ఘటన తరువాత ఇదే తొలిసారి**



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సులో ఆయన పాల్గొంటారు. గల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్పింగ్లతో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది కజాన్లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్పింగ్ మోదీ భేటీ అయిన విషయం తెలిసిందే.

## విమానాశ్రయాలకు ఉగ్రముప్పు

**- నిఘా వర్గాల హెచ్చరిక**

దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల భద్రతకు ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఉగ్ర సంఘ వ్యతిరేక శక్తులు దాడులకు పాల్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా అన్ని ఎయిర్పోర్టుల్లో హైఅలర్ట్ ప్రకటించారు. ఈ ఏడాది సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 మధ్య విమానాశ్రయాలపై దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. దీంతో కేంద్ర పౌర విమానయాన భద్రతా బ్యూరో అన్ని ఎయిర్పోర్టులకు అడ్వైజరీ జారీ చేసింది. విమానాశ్రయాల్లో తక్షణమే భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించింది. రన్వేలు, హెలీప్యాడ్స్, ఫ్లయింగ్ స్కూల్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లలో భద్రత పెంచాలని సూచించింది. దీంతో విమానాశ్రయాల వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. టెర్మినల్స్, పార్కింగ్ ఏరియా, పెరీమీటర్ జోన్, ఇతర సున్నితమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్ను పెంచారు. స్థానిక పోలీసుల సహకారంతో ఎయిర్పోర్టులకు వెళ్లే మార్గాల్లోనూ తనిఖీలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అంతర్జాతీయ, దేశీయ మార్గాల్లో పంపే మెయిల్ పార్సిళ్లను క్షుణ్ణంగా సోదా చేస్తున్నారు. సిబ్బంది, కాంట్రాక్టర్లు, విజిటర్స్ను కూడా తనిఖీలు చేయాలని నిర్ణయించారు. విమానాశ్రయాల వద్ద అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు గానీ, లగేజీ గానీ కన్పిస్తే తక్షణమే సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని ప్రయాణికులకు సూచించారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీములను యాక్టివేట్ చేశారు. అవసరమైతే మాక్ డ్రిల్స్ చేపట్టాలని పౌర విమానయాన భద్రతా బ్యూరో సంబంధిత అధికారులకు సూచించింది.

## కోర్టు ఆదేశాలతోనే మాధురి తరలింపు

**- కొల్హాపూర్ ఏనుగు వివాదంపై వంతారా వివరణ**

మహారాష్ట్రలోని కొల్హాపూర్కు చెందిన 'మాధురి' అనే ఏనుగు తరలింపు వివాదంపై వంతారా అధికారికంగా స్పందించింది. కోర్టు ఆదేశాల మేరకే తరలించాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. ఒకవేళ కోర్టు అనుమతిస్తే తిరిగి కొల్హాపూర్ తరలించేందుకు సిద్ధమని పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనను విడుదల చేసింది.

కొల్హాపూర్లోని నందనీ గ్రామంలోని జైనమఠంలో దాదాపు 33 ఏళ్ల పాటు సేవలందించిన 'మాధురి'ని (మహాదేవి అని కూడా పిలుస్తారు) జామ్నగర్లోని వంతారాకు తరలించారు. ఏనుగు ఆరోగ్యం గురించి ఆందోళన లేవనెత్తుతూ పెటా 2023లో బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై 2024 జూలైలో తీర్పు వెలువడింది. పునరావాస కేంద్రానికి తరలించాలని కోర్టు ఆదేశించింది. ఇదే అంశం సుప్రీంకోర్టుకు చేరడంతో సర్వోన్నత న్యాయస్థానం సైతం హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో మాధురిని వంతరాకు తరలించి.. జామ్ నగర్లోని రాధేకృష్ణ టెంపుల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాని సంరక్షణ బాధ్యతలు చూస్తున్నారు. అయితే, మాధురి తరలింపుపై స్థానిక జైనమతం భక్తులు, స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మాధురితో ఏళ్లుగా ఉన్న అనుబంధం దృష్ట్యా తమ నుంచి దూరం చేయడాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో వంతారా స్పందించింది. బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే ఏనుగును తరలించాల్సి వచ్చిందంటూ వివరణ ఇచ్చింది. ఒకవేళ కోర్టు అనుమతిస్తే మాధురిని తిరిగి పంపించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టంచేసింది.

కోర్టు అనుమతితో మాధురి కోసం కొల్హాపూర్లోనే ప్రత్యేకంగా పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమని ప్రతిపాదించింది. గొలుసుల్లేకుండా ఎన్క్లోజర్ ఏర్పాటు చేయడంతో పాటు ఏనుగు సంరక్షణ బాధ్యతలు చూసుకుంటామని స్పష్టంచేసింది. ఒకవేళ జైన మఠం ప్రత్యామ్నాయ ఆలోచనతో ముందుకొచ్చినా స్వాగతిస్తామని వంతారా ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ వ్యవహారంలో ఎవరికైనా ఇబ్బంది కలిగించి ఉంటే క్షమించాలని కోరింది. ఇదే అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా స్పందించారు. వంతారా ప్రతినిధులతో బుధవారం భేటీ అయిన ఆయన.. మాధురిని తిరిగి రప్పించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేయనున్న పిటిషన్లో భాగస్వామ్యం అవుతామని ప్రకటించిందంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. నందనీ ప్రాంతంలో పునరావాస కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చిందని తెలిపారు.

# ఉక్రెయిన్ యుద్ధం కొలిక్కివచ్చేనా?

## పుతిన్‌తో ట్రంప్ రాయబారి విట్కాఫ్ భేటీ - నేటితో ముగుస్తున్న యుద్ధ విమరణ గడువు



ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై ఓ ఒప్పందానికి రావాలంటూ రష్యాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీనిపై నిర్ణయం తీసుకోకపోతే పెద్దఎత్తున సుంకాలతో శిక్షిస్తానని హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నేడు మాస్కో వేదికగా రష్యా అధినేత పుతిన్‌తో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని క్రెమ్లిన్ వెల్లడించింది. ఒప్పందం విషయంలో పుతిన్‌కు ట్రంప్ విధించిన గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్ సైతం ఎదురుదాడులు కొనసాగిస్తుండటంతో ఇటీవల కాలంలో యుద్ధం తీవ్రత మరింత ముదిరింది. యుద్ధం ముగింపు విషయంలో ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు విఫలమయ్యాయి. తాను అధికారంలోకి వస్తే యుద్ధానికి తెరదించుతానని పేర్కొన్న డొనాల్డ్ ట్రంప్.. ఈమేరకు ప్రయత్నాలు చేస్తున్నారు. యుద్ధం ముగింపుపై తొలుత 50రోజుల్లోపు ఓ ఒప్పందానికి రావాలని రష్యాను హెచ్చరించిన ఆయన.. ఇటీవల ఆ గడువును మరింత తగ్గించారు. మరోవైపు.. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4.30 గంటలకు (భారత్‌లో గురువారం అర్ధరాత్రి 2 గంటలకు) ట్రంప్ ఓవల్ ఆఫీసులో కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. ఒకవేళ రష్యా కాల్పుల విరమణకు అంగీకరించకపోతే.. ఆ దేశంపై ఆంక్షలు విధించే అవకాశాలు కన్పిస్తున్నాయి. భారత్‌పైనా సుంకాలు పెంచుతానంటూ ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. తమపై అమెరికా విధించిన అంతర్జాతీయ ఆంక్షలు పరిమిత ప్రభావాన్నే చూపాయని క్రెమ్లిన్ ఇదివరకే స్పష్టం చేసింది. ఉక్రెయిన్ మాత్రం.. ఆంక్షలను మరింత పెంచాలని పాశ్చాత్య మిత్రదేశాలను కోరుతోంది.

## ఫ్రాన్స్‌లో కార్చిచ్చు..

### 12వేల హెక్టార్లలో అగ్నికీలలు.. 25 ఇళ్ల దగ్ధం



దక్షిణ ఫ్రాన్స్‌లో భారీ కార్చిచ్చు చోటుచేసుకుంది. మంగళవారం ఫ్రాన్స్‌లోని ఆడ్ డిపార్ట్‌మెంట్ ప్రాంతంలో ఎగసిపడిన అగ్నికీలల్లో ఇప్పటి వరకు దాదాపు 12,000 హెక్టార్ల విస్తీర్ణంలో చెట్లు కాలిపోయాయని అధికారులు పేర్కొన్నారు. కిలోమీటర్ల దూరంలోని గ్రామాలకు సైతం భారీగా పొగ వ్యాపించిందని.. ఈ కార్చిచ్చుకారణంగా సమీపంలోని 25ఇళ్లు పూర్తిగా కాలిపోయాయని తెలిపారు. మంటలను అదుపు చేయడానికి 1,800 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. దీనికి వైమానిక దళాల సహాయం కూడా తీసుకుంటున్నారు. గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో అధికారులు పలు సూచనలు జారీ చేశారు. ఇప్పటికే ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారని తెలిపారు. ఆడ్ డిపార్ట్‌మెంట్ పాంతానికి దగ్గరలో ఉన్న ఓ గ్రామం మొత్తాన్ని ఖాళీ చేయించినట్టు స్థానిక అధికారులు వెల్లడించారు. ప్రభావం ఎక్కువగా ఉండే సమీప ప్రాంతాల్లోని వారిని తరలిస్తున్నామన్నారు.ఎన్నిప్రయత్నాలు చేసినప్పటికీ కార్చిచ్చు వ్యాప్తి ఆగట్లేదని.. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవని తెలిపారు. మంటల నేపథ్యంలో చుట్టుపక్కల రహదారులను మూసివేయడంతో రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది.

## భారత్‌ను దూరం చేసుకోవద్దు

### డొనాల్డ్ ట్రంప్‌నకు నిక్కీ హేలీ సలహా



భారత్‌లాంటి బలమైన మిత్రదేశంతో అమెరికా తన సంబంధాలను దెబ్బతీసుకోకూడదని భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నాయకురాలు నిక్కీ హేలీ పేర్కొన్నారు. భారత్ తమకు మంచి భాగస్వామి కాదంటూ, దానిపై సుంకాల భారాన్నీ గణనీయంగా పెంచుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నిక్కీ హేలీ ఇరుదేశాల సంబంధాలపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. రష్యానుంచి భారత్ చమురు కొనుగోలు చేయకూడదు కానీ, చైనా చేయొచ్చా? అని ఆమె ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. రష్యా నుంచి చైనా అత్యధికంగా ఇంధన కొనుగోలు చేస్తోందన్నారు. అలాంటి దేశానికి మాత్రం సుంకాల నుంచి 90 రోజులు మినహాయింపు ఇచ్చారని ట్రంప్ పరిపాలనపై పరోక్షంగా విమర్శలు చేశారు. ఈసందర్భంగా చైనాకు ఇలాంటి అనుమతులు ఇస్తూ.. భారత్‌లాంటి బలమైన మిత్ర దేశంతో సంబంధాలను దూరం చేసుకోవద్దని సూచించారు. దక్షిణ కరోలినా మాజీ గవర్నర్ అయిన హేలీ.. ట్రంప్ మొదటిసారి అధికారంలో ఉన్నప్పుడు ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారిగా ఉన్నారు. 2024లో అధ్యక్ష అభ్యర్థి రేసులో పోటీ చేసిన ఆమె.. తర్వాత ట్రంప్‌నకు మద్దతు తెలిపారు.

ఇదిలాఉండగా.. నిన్న మొన్నటివరకు భారత్‌ను తమ మిత్రదేశంగా పేర్కొన్న ట్రంప్, తాజాగా మాట మార్చేశారు. ఆ దేశం తమకు మంచి భాగస్వామి కాదని వ్యాఖ్యానించారు. రష్యానుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నారనే కారణంతో 25శాతం సుంకంతో పాటు పెనాల్టీలు విధిస్తున్నట్టు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ టారిఫ్‌లను గణనీయంగా పెంచుతానంటూ హెచ్చరికలకు దిగారు. మాస్కోనుంచి ఇంధనం కొనుగోలు చేయడంవల్ల వారు యుద్ధం చేయడానికి సహకరించినట్లవుతుందని, అందుకే తాను సంతోషంగా లేనని వ్యాఖ్యానించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో రష్యా భారత్‌కు మద్దతుగా నిలిచింది. తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు వీలుగా వాణిజ్య, ఆర్థిక భాగస్వాములను ఎంచుకునే హక్కు సార్వభౌమ దేశాలకు ఉంటుందని స్పష్టం చేసింది..

## భారత్‌పై సుంకాలా? రష్యాపై ఆంక్షలా!?

- అర్ధరాత్రి 2 గంటలకు ట్రంప్ కీలక ప్రకటన
- మరో సంచలనానికి తెరలేపిన ప్రపంచ పెద్దన్న

అనూహ్య ప్రకటనలతో ప్రపంచ దేశాలను బెంబేలెత్తిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలనానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం4.30 గంటలకు (అంటే భారత్‌లో గురువారం అర్ధరాత్రి 2గంటలకు) ట్రంప్ ఓవల్ ఆఫీసులో కీలక ప్రకటన చేయనున్నారు. ఈవిషయాన్ని వైట్‌హౌస్ ధ్రువీకరించింది. దీంతో ఆయన ఏం చెప్పనున్నారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. భారత్‌పై సుంకాల గురించే ప్రకటనచేసే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**టార్గెట్ భారత్..?**



మరో 24 గంటల్లో భారత్‌పై సుంకాల బాంబు పేలుస్తానంటూ ఇప్పటికే ట్రంప్‌హెచ్చరించిన సంగతి తెలిసిందే. న్యూఢిల్లీ తమకు మంచి వ్యాపార భాగస్వామి కాదని,ఆదేశం రష్యానుంచి చమురును కొనుగోలు చేస్తోందని ధ్వజమెత్తారు. దానివల్ల మాస్కో యుద్ధ ఇంజిను ఇంధనం సమకూరుతోందని మండిపడ్డారు. ఈ విషయంపై తాను సంతోషంగా లేనని, అందుకే భారీగా సుంకాలు పెంచుతామని పేర్కొన్నారు. దీంతో ట్రంప్ చేయబోయే ప్రకటన దీనిపైనే ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే న్యూఢిల్లీపై ఆయన 25శాతం టారిఫ్‌ను విధించారు.

**రష్యాపై ఆంక్షలా?**

ప్రస్తుతం అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కోఫ్‌మాస్కోలో పర్యటిస్తున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆయన చర్చలు జరపనున్నట్టు సమాచారం. ఈసమావేశం అనంతరం కీలకప్రకటన ఉండొచ్చని ఇప్పటికే ట్రంప్ సంకేతాలిచ్చారు. దీంతో రష్యా కాల్పుల విరమణకు అంగీకరించకపోతే ఆ దేశంపై ఆంక్షలు విధించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

మరోవైపు, అమెరికా బ్యాంకుల పైనా ట్రంప్ విరుచుకుపడ్డారు. అవి రాజకీయ వివక్షచూపుతున్నాయని విమర్శించారు. ఫెడ్ చైర్మన్ పదవికి నలుగురు రేసులో ఉన్నట్టు ట్రంప్ తెలిపారు. దీనిపై ఆయన ప్రకటన చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇక, సెమీకండక్టర్లు, ఫార్మా రంగాలపైనా త్వరలోనే కీలక నిర్ణయం తీసుకుంటానని ఇటీవల అధ్యక్షుడు పేర్కొన్నారు. దానిపై ప్రకటన చేయొచ్చని సమాచారం. ఈ పరిణామాలవేళ ట్రంప్ మీడియా సమావేశంపై ఆసక్తి నెలకొంది.



## నేను మోదీకి కాల్ చేస్తా

### ట్రంప్ ఆఫర్‌కు బ్రెజిల్ అధ్యక్షుడి సమాధానం

'సమస్యల పరిష్కారంపై చర్చల కోసం ఎప్పుడైనా కాల్ చేయవచ్చు' అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన ఆఫర్‌ను బ్రెజిల్ అధ్యక్షుడు లుల డిసిల్వా తిరస్కరించారు. ఆయనకు తప్ప మోదీ, జిన్పింగ్ సహా ఎవరికైనా కాల్ చేస్తానని చెప్పారు. బ్రెజిల్‌లోని బ్రసిలియాలో డిసిల్వా మాట్లాడుతూ "మేము మా ప్రయోజనాలను కాపాడుకొనేందుకు ప్రపంచ వాణిజ్య సంస్థ మొదలు అన్ని ఆప్షన్లను వినియోగిస్తాము. విదేశీ వాణిజ్యాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంది. అమెరికాలో కొత్త ప్రభుత్వం రాగానే.. దేశీయ కంపెనీలకు కొత్త అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం. నేను అమెరికా అధ్యక్షుడికి ఫోన్ చేయను. ఆయన చర్చలకు సిద్ధంగా లేరు. నేను అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రధాని మోదీకి కాల్ చేస్తాను. పుతిన్‌కు కూడా కాల్ చేయను. ఎందుకంటే ఆయన మాతో ప్రయాణించడం లేదు కాబట్టి. దీంతోపాటు ఇతర ప్రపంచ నేతలతో కూడా ఫోన్‌లో మాట్లాడతాను" అని తేల్చిచెప్పారు. కాగా, తన మిత్రుడు, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైరో బోల్సెనారోపై దర్యాప్తు చేపట్టడాన్ని ట్రంప్ తప్పు పట్టారు. బ్రెజిల్‌పై అత్యధికంగా 50శాతం పన్ను టారిఫ్ విధించారు. దీంతో వాషింగ్టన్–రియో డి జనేరియోల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది బ్రెజిల్‌లో కాప్30 సదస్సు జరగనుంది. విభేదాలను పక్కనపెట్టి కార్యక్రమానికి ట్రంపును ఆహ్వానిస్తానని డిసిల్వా చెప్పారు. కేవలం వాతావరణ మార్పులపై ఆయన అభిప్రాయం తెలుసుకోవడానికి ఇలా చేస్తానన్నారు. ఆయన రావాలనుకోకపోతే గైర్హాజరవుతారన్నారు. బ్రెజిల్ చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

## మళ్లీ.. నోరు పారేసుకున్న పాక్

### భారత్‌పై అక్కసు.. కశ్మీర్‌పై షెహబాజ్ వ్యాఖ్యలు

పాక్ ప్రధాని షెహబాజ్ మరోసారి భారత్‌పై నోరు పారేసుకున్నారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దయి ఆరేళ్లు పూర్తయినా.. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కశ్మీర్ అంశంపై మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్– పాకిస్థాన్ల మధ్య ఉద్రిక్తతలకు కశ్మీర్ ప్రధాన కారణమని మరోసారి నోరు పారేసుకున్నారు. శాంతిస్థాపన




కోసం 2019లో భారత ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేయడంపై అక్కసు వెళ్లగక్కారు. ఈ విషయంలో న్యూఢిల్లీ ఏకపక్షంగా చర్యలు తీసుకుందంటూ ఆయన భారత్‌పై నిందలు మోపారు. ఈ సమస్యకు న్యాయపరమైన పరిష్కారానికి తమ విదేశాంగ విధానం కట్టుబడి ఉందంటూ మళ్లీ పాత పాటే పాడారు. ఓ ర్యాలీలో పాక్ ఉప ప్రధాని ఇషాక్‌దార్ మాట్లాడుతూ.. తాము పొరుగుదేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కోరుకుంటున్నామన్నారు. ఘర్షణల కంటే దౌత్యాన్నే ఇష్టపడతామంటూ వ్యాఖ్యలు చేశారు. ఈసందర్భంగా ఎవరైనా దురాక్రమణలకు పాల్పడితే గట్టిగా బదులు ఇచ్చేందుకు తమ సాయుధ దళాలు తగిన సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ సహా పలు ప్రావిన్స్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించడం గమనార్హం.

# ఆకట్టుకున్న ఘాటి ట్రైలర్



అనుష్కశెట్టి, విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రల్లో క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన చిత్రం ఘాటి. చింతకింది శ్రీనివాసరావు కథను అందించారు. విడుదలకు సిద్ధమైన సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్‌ను చిత్ర బృందం బుధవారం విడుదల చేసింది. మాదకద్రవ్యాల మాఫియా నేపథ్యంతో రూపొందిన సినిమాలో అనుష్క రెండు కోణాలున్న పాత్ర పోషించినట్టు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. 'సీతమ్మోరు లంకా దహనం చేస్తే ఎట్టుంటాదో చూద్దూగానీ'లాంటి డైలాగ్స్, విజువల్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పాన్ ఇండియా స్థాయిలో సినిమా సెప్టెంబరు 5న రిలీజ్ కానుంది.



నేను గేమింగ్ యాప్‌నే

## ప్రమోట్ చేశా

తాను గేమింగ్ యాప్‌ని ప్రమోట్ చేశానని, గేమింగ్ యాప్స్‌కు, బెట్టింగ్ యాప్‌కు తేడా ఉందన్నారు నటుడు విజయ్ దేవరకొండ. దాదాపు నాలుగున్నర గంటలపాటు ఈడీ విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "బెట్టింగ్ యాప్ కేసులో నా పేరు రావడంతో విచారణకు పిలిచారు. దేశంలో బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్.. ఇలా రెండు రకాలున్నాయి. నేను ఏ-23 అనే గేమింగ్ యాప్‌ని ప్రమోట్ చేశానని క్లారిటీ ఇచ్చా. బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్‌కి సంబంధం లేదు. గేమింగ్ యాప్స్ చాలా రాష్ట్రాల్లో లీగల్. గేమింగ్ యాప్స్‌కి జీఎస్టీ, టాక్స్, అనుమతులు, రిజిస్ట్రేషన్ ఉంటాయి. నా బ్యాంకు లావాదేవీల వివరాలన్నీ ఈడీకి సమర్పించా. నేను ప్రమోట్ చేసిన ఏ-23 యాప్ తెలంగాణలో ఓపెన్ కాదు. నేను లీగల్ గేమింగ్ యాప్‌ను మాత్రమే ప్రమోట్ చేశా. సంబంధిత కంపెనీతో నేను చేసుకున్న ఒప్పందం వివరాలూ ఈడీకి వెల్లడించా" అని తెలిపారు.



## మనోజ్ కొత్త ప్రాజెక్ట్ డేవిడ్‌రెడ్డి

మంచు ఫ్యామిలీ ఇద్దరి హీరోల నుంచి ఈ ఏడాది భైరవం, కన్నప్ప చిత్రాలు వచ్చాయి. మంచు విష్ణు కన్నప్ప తర్వాతి ప్రాజెక్టు ఏమిటన్నది ఇంకా అనౌన్స్ చేయలేదు. కానీ మంచు మనోజ్‌నుంచి మాత్రం సాలిడ్ ప్రాజెక్ట్ ఇప్పుడు అనౌన్స్ అయ్యింది. భారీ పీరియాడిక్ డ్రామా "డేవిడ్ రెడ్డి"ని అనౌన్స్ చేశారు. 21 ఏళ్ల సినీకెరీర్లో తన 21వ ప్రాజెక్ట్‌గా సినిమా తనకెంతో ప్రత్యేకమని మనోజ్ చెబుతున్నాడు. దర్శకుడు హనుమరెడ్డి యక్కంటి తెరకెక్కిస్తున్న సినిమా బ్రిటిష్ కాలంనాటి నేపథ్యంలో ప్లాన్ చేస్తున్నారు. 1897 నుంచి 1922 కాలంలో కథగా మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. మరి మంచు మనోజ్ నుంచి ఈ బిగ్ ప్రాజెక్ట్ ఎలా ఉండబోతుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి వెల్వెట్ సోల్, టూర్ రాడిక్స్ సంస్థలు నిర్మాణం వహిస్తుండగా ఇతర వివరాలు త్వరలోనే బయటకి రానున్నాయి.

ఓటీటీకి హారర్ థ్రిల్లర్..

# అంధేరా

ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు మరో హారర్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ సిద్ధమైంది. అదే 'అంధేరా'. 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో ఆగస్టు 14నుంచి స్ట్రీమింగ్ కానుంది. కరణ్‌వీర్ మల్హోత్రా, ప్రియా బాపట్, సుర్వీన్ చావ్లా ప్రధాన పాత్రల్లో దర్శకుడు రాఘవ్ ధర్ తెరకెక్కించారు.

స్ట్రీమింగ్ వివరాలను వెల్లడిస్తూ చిత్ర బృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా సిరీస్ క్రియేటర్ గౌరవ్ దేశాయ్ మాట్లాడుతూ.. "నాకు బాగా సంతృప్తినిచ్చిన సిరీస్ ఇది. హారర్, సూపర్ నేచురల్ జానర్లపై నాకు ఆసక్తి. ఆ రెండింటి మేళవింపుగా రూపొందిన సినిమా ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కూడిన కథకు ఎమోషన్‌ను జోడించడాన్ని సవాలుగా తీసుకున్నా" అని తెలిపారు. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కాసిమ్ మాట్లాడుతూ.. "ఈ జానర్ స్టోరీని ఇలానే చెప్పాలి' అనే పరిధులను 'అంధేరా'తో చెరిపేయాలని ముందే నిర్ణయించుకున్నాం. ఇది సూపర్నేచురల్ థ్రిల్లర్ మాత్రమే కాదు.. ఎన్నో అంశాలున్నాయి" అని పేర్కొన్నారు.



## పాట వదులుతున్న కిష్కంధపురి



హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ లేటెస్ట్ చిత్రం 'కిష్కింధపురి'. శరవేగంగా షూటింగ్ జరుగుతోన్న సినిమాను కౌశిక్ పెగళ్లపాటి డైరెక్ట్ చేస్తున్నారు. హార్రర్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది ఈ సినిమా. ఇక ఈ సినిమానుంచి ఇప్పటికే ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేయగా, దానికి సాలిడ్ రెస్పాన్స్ లభించింది. ఇప్పుడు సినిమానుంచి మరో సాలిడ్ అప్డేట్ ఇచ్చేందుకు మేకర్స్‌రెడీ అయ్యారు. సినిమా ఫస్ట్ సింగిల్ సాంగ్‌ను రిలీజ్ చేసేందుకు రెడీ అయ్యారు. ఈమేరకు ఓ అనౌన్స్‌మెంట్ కూడా తాజాగా చేశారు. 'ప్రేతభయంకంటే ముందుప్రేమ పరిచయం చేస్తున్నాం' అంటూ ఓ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. ఇక ఈ పాటను ఆగస్టు 7న రిలీజ్ చేస్తున్నట్టు మేకర్స్ వెల్లడించారు. సినిమాలో అందాల భామ అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తుండగా సామ్ సిఎస్ సంగీతం అందిస్తున్నాడు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.




ఇక పరశురామ

## ఉగ్రరూపమే..

హొంబాలే ఫిలింస్ నుంచి వచ్చిన యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహా' బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోంది. ఏకంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లు కలెక్ట్ చేసి రికార్డులు తిరగరాసింది. సినిమాకు ఇలాంటి యునానిమస్ రెస్పాన్స్ రావడం సంతోషంగా ఉందని దర్శకుడు అశ్విన్ కుమార్ అన్నారు. అయితే, ఈ సినిమా తర్వాత తాము 'మహావతార్ పరశురాముడు' చిత్రాన్ని రూపొందించబోతున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ జరుగుతుందని.. ఈ సినిమాతో థియేటర్ల టాప్ లేవాల్సిందే అని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'మహావతార్ నరసింహా'కంటే ఎక్కువ ఉగ్రరూపాన్ని పరశురాముడి సినిమాలో ఉంటుందని.. ఈ విధ్వంసంతో ప్రేక్షకులు ఊగిపోవడం ఖాయమని ఆయన అంటున్నారు. ఈ సినిమాను మరింత ఎక్కువ బడ్జెట్‌తో తెరకెక్కించబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

## సంక్రాంతికేనా..

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది రాజాసాబ్'. బిగ్గెస్ట్ హారర్ ఫాంటసీ ఫిల్మ్‌గా సిద్ధమవుతోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న విడుదల చేయనున్నట్టు గతంలో దర్శక నిర్మాతలు తెలిపారు. అయితే,కొన్నిరోజులుగా ఇది వాయిదా పడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. అలాగే తాజాగా విడుదల చేసిన మాళవిక మోహనన్ పోస్టర్‌పై రిలీజ్ డేట్ లేకపోవడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత టీజీ విశ్వప్రసాద్ దీని రిలీజ్‌పై మాట్లాడారు. షూటింగ్ దాదాపు పూర్తయిందన్నారు. "ది రాజాసాబ్ సంక్రాంతికి వస్తే బాగుంటుందని ప్రభాస్ అభిమానులు కోరుకుంటున్నారు. వారి హీరోను పెద్ద పండగకు స్క్రీన్‌పై చూసుకోవాలని భావిస్తున్నారు. తెలుగు బిజినెస్ సర్కిల్ వారు కూడా ఈ సినిమాను జనవరి 9న విడుదల చేయాలని చెబుతున్నారు. కానీ, హిందీ ఆడియన్స్ మాత్రం డిసెంబర్ 5న విడుదల చేయాలని బలంగా కోరుతున్నారు ఎందుకంటే డిసెంబర్లో అక్కడ పెద్ద సినిమాలు ఏవీ లేవు. అందుకని సంవత్సరం చివర్లో విడుదల చేయాలని అంటున్నారు. అక్టోబర్ చివరికి సినిమా అంతా పూర్తవుతుంది. విడుదలపై నిర్ణయం తీసుకోవాలి" అని నిర్మాత తెలిపారు. 'రాజాసాబ్ 2' కూడా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

